మా కలం - సామాన్యుడి బలం
# నంది పత్రిక
GSTIN 37AMRPM5719R1ZX
జాతీయ తెలుగు దిన పత్రిక
RNI-APTEL/2023/88162
ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 193 | ఆదివారం 19- 07 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028



## అహ్మదాబాద్ బాణసంచా యూనిట్‌లో భారీ పేలుడు.. 9 మంది మృతి



# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం




- చెత్తనుంచి సంపద సృష్టించడమే మా లక్ష్యం
- తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేయాలి
- ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు
- రౌడీయిజం చేసేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక - గుడివాడ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు

# ఓ మంచి ఆలోచనతో ముందడుగు వేద్దాం..



- మంచి అలవాట్లు సమాజంలో పెద్ద మార్పునకు పునాదులు
- మన అందరి ఆరోగ్యం, ఆనందానికి సమష్టిగా కృషిచేద్దాం
- ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉందాం
- పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

# పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.



# బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై కారం చల్లిన రైతులు

- బహదూర్‌గూడలో భూసేకరణపై ఘర్షణ
- పోలీసులపై కారం చల్లి దాడి చేసిన రైతులు
- కానిస్టేబుళ్లు సహా పలువు పోలీసులకు గాయాలు
- 600 ఎకరాల భూముల స్వాధీనానికి వ్యతిరేకత
- ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగింపు



## ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ కొరత రావద్దు




### అవసరమైన సరఫరా కొనసాగించాలన్న భట్టి

ఎల్‌నినో సవాళ్లను ముందుగానే అంచనా వేసి రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని విస్తరించడం, రాష్ట్రవ్యాప్తంగా 'పవర్ అంబులెన్స్' సేవలను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించడం, ఐటీ కారిడార్‌లో అవసరమైన చోట ్గ÷÷–లఓల్గ÷వర్ల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అదే విధంగా, తెలంగాణ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధన, తాడిచర్ల-2 బ్లాక్‌లో నిర్ణీత గడువులో ఉత్పత్తి ప్రారంభం, కోయగూడెం3, సత్తుపల్లి3 బ్లాక్‌లను సింగరేణికి దక్కేలా కార్యాచరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తూ ప్రతి రంగానికి విశ్వసనీయ విద్యుత్ అందించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి అన్నారు.

# 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం



- స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు
- ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం

భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య
- పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి



# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు

బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

# రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం:

తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

# అహ్మదాబాద్ బాణసంచా యూనిట్‌లో భారీ పేలుడు.. 9 మంది మృతి

**అహ్మదాబాద్‌లోని బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం**

**ఆసుపత్రుల్లో పలువురికి చికిత్స, కొందరి పరిస్థితి విషమం**

**ఈ కేంద్రం అక్రమంగా నడుపుతున్నట్లు పోలీసుల అనుమానం**

**ప్రధాని మోదీ, సీఎం భూపేంద్ర పటేల్ సంతాపం, ఎక్స్‌గ్రేషియా ప్రకటన**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శనివారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అక్రమంగా నిర్వహిస్తున్నట్లు భావిస్తున్న బాణసంచా తయారీ యూనిట్‌లో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగడంతో 9 మంది మృతి చెందారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.వివరాల్లోకి వెళితే, రామోల్ ప్రాంతంలోని మెహమూద్‌పురాలో ఓ ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. పేలుడు జరిగిన వెంటనే 9 మందిని ఎల్.జి. ఆసుపత్రికి తరలించగా, వారిలో నలుగురు అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్ర గాయాలతో చేరిన ఐదుగురిలో చికిత్స పొందుతూ మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. 95 శాతం కాలిన గాయాలతో వీరు మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరో ఆరుగురిని అసర్వా సివిల్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఒకరు మరణించారు.పేలుడు శబ్దం వినిపించిన వెంటనే సమీపంలోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అహ్మదాబాద్ మేయర్ హితేష్ బారోట్, ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. పేలుడుకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంధన పంటలకు ఇదే తరుణం!

వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో అమ్మే అన్ని మోటారు వాహనాలూ ఎలక్ట్రిక్ వెహికిల్స్ మాత్రమే కావాలి. ఒక దశాబ్దకాలంలో మనం దశలవారీగా డీజిల్, పెట్రోల్ వాహనాలను తొలగిస్తూ, వందశాతం ఈవీలకు మళ్లగలిగితే.. మనకు ఏడాదికి 25 కోట్ల టన్నుల భారీ స్థాయి ముడిచమురు అవసరం ఉండదు. బొగ్గు, చమురుపై ఆధారపడటం మానవాళి చరిత్రలో స్వల్పకాలిక దశ మాత్రమే. చివరికి మనకి బొగ్గు, చమురు, గ్యాస్ వనరులు ఖాళీ అవుతాయి. సౌరశక్తిని, జీవపదార్థాన్ని (బయోమాస్) ప్రత్యామ్నాయ ఇంధనంగా మార్చటం మీదే భవిష్యత్తు ఆధారపడి ఉంది. సౌర విద్యుదుత్పత్తి, స్టోరేజీ బ్యాటరీల ద్వారా ఇప్పుడు మనం ఆ ఇంధన స్వప్నానికి మునుపెన్నడూ లేనంత చేరువలోకి వచ్చాం. జీవ పదార్థాన్ని వినియోగ ఇంధనంగా సమర్థవంతంగా మార్చుకోవటానికి కొత్త సాంకేతికతలు ఇప్పుడు మనకో అవకాశాన్నిస్తున్నాయి.మన వ్యవసాయ సాగుభూమి 170180 మిలియన్ హెక్టార్లు. మొత్తం ప్రపంచ సాగునేలలో ఇది సుమారు 11శాతం. ఏడాది పొడవునా పంటలకు అనుకూలంగా ఉండేలా పుష్కలమైన సూర్యరశ్మి, ఉష్ణోగ్రతలు మనకున్నాయి. మన రుతుపవనాలు కావలసినంత వర్షపాతాన్ని అందిస్తాయి. మన భూములు సారవంతమైనవి. 1950లో భారత్ సుమారు 5.2 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను మాత్రమే ఉత్పత్తి చేసింది. దీనివల్ల మనం దిగుమతులపై భారీగా ఆధారపడ్డాం. అలాంటిది, ఇప్పుడు మనకు భారీ మిగులు ఉంది. 202425లో రికార్డు స్థాయిలో 35.8 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేశాం. దిగుబడుల సమయంలో, మన ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) 8 కోట్ల మెట్రిక్ టన్నుల వరకు గోదాములలో నిల్వ చేస్తోంది. ప్రస్తుతం మన ధాన్యం గిడ్డంగులలో 6 కోట్ల మెట్రిక్ టన్నుల నిల్వలున్నాయి. ఆహారధాన్యాలను ఇలా మనం పెద్దఎత్తున ఉత్పత్తి చేస్తున్నా, వినియోగంలో సమాజం పోకడలు మాత్రం మారిపోయాయి. ప్రజల ఆహారపు అలవాట్లు మారటం, వైవిధ్యభరితం కావటంతో బియ్యం, గోధుమల తలసరి వినియోగం తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో వాటికి డిమాండ్ పరిమితమైంది. అయినా కూడా ఎప్పుడో కొరతల కాలంలో ప్రవేశపెట్టిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూపంలో మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి ప్రభుత్వం బలవంతంగా ధాన్యం కొనాల్సి వస్తోంది. వాటిని ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లోకి ఇబ్బడిముబ్బడిగా సరఫరా చేస్తోంది. పీడీఎస్‌కి సరఫరా చేసిన ఆహార ధాన్యాలలో సుమారు 40 శాతాన్ని లబ్ధిదారులు మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. రీసైక్లింగ్‌తో ఇవి చాలా సందర్భాలలో తిరిగి ఎఫ్‌సీఐకి చేరుతున్నాయి. మరోవంక, ఎంఎస్‌పీ పేరుతో అర్థరహిత ప్రోత్సాహకం ఇస్తుండటంతో రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలకు మళ్లటానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు.ఇంధన పంటల పెంపకానికి సరైన రీతిలో రూపకల్పన చేసి అమల్లోకి తెస్తే, అన్ని సమస్యలనూ ఒక్కసారిగా పరిష్కరించగలదు. రైతులకు ఆదాయం పెరగటం, ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గించటం, గ్రామీణ పారిశ్రామికీకరణను ప్రోత్సహించటం, ఇంధన భద్రత కల్పించటం, చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించటం, పర్యావరణాన్ని పరిరక్షించటం.. ఇవన్నీ ఆ ఒక్క మార్పుతో సాధ్యమవుతాయి. ఉదాహరణకు, హైబ్రిడ్ సూపర్ నేపియర్ గ్రాస్‌ను నీటి వనరులున్న వరి సాగు భూముల్లో పండించటం. ఆ గడ్డి పెంపకానికి ఆ తరహా భూములు అనువైనవి. దీనివల్ల, రైతులు ఎకరాకు ఏడాదికి సుమారు 160 మెట్రిక్ టన్నుల తాజా గడ్డిని పండించగలరు. దీన్నుంచి 8 టన్నుల కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)ను ఉత్పత్తి చేయవచ్చు. ఇది ఎల్‌పీజీ(వంటగ్యాస్)కి ప్రత్యామ్నాయం. అంతేకాదు, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం (బయోచార్), జీవ ఇంధన ఎరువు వంటివి ఉత్పత్తి చేసి అమ్ముకోవచ్చు. ఈ రకంగా రైతులు ఎకరాకు రూ.80,000 నుంచి 1,00,000 నికర ఆదాయాన్ని ఆర్జించవచ్చు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించనవసరం లేదు. రైతులకు గ్యారంటీగా, స్థిరంగా మంచి ధర లభించేలా భరోసాకు చర్యలు తీసుకుంటే చాలు (ఉదాహరణకు, తాజా నేపియర్ గడ్డి ఎం.టికి రూ.700800, ఎండు రకానికి టన్నుకు రూ.3,000 వరకు). కాంట్రాక్ట్ వ్యవసాయ పద్ధతిలో ముడిసరుకు లభ్యతకు ఢోకా లేకుండా సీబీజీ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలి. ప్రభుత్వం ఇప్పటికే అటువంటి పరిశ్రమలకు పెట్టుబడి వ్యయ (క్యాపెక్స్) రాయితీలు, సీబీజీ కొనుగోలుకు హామీ ఇవ్వటం వంటి రూపాల్లో ప్రోత్సాహకాలను ఇస్తోంది. మనం చేయవలసిందల్లా ఈ ప్రక్రియను విస్తృత స్థాయికి విస్తరించటం. కాంట్రాక్ట్ వ్యవసాయం, ఉత్పత్తుల సేకరణకు విధివిధానాలను రూపొందించటం, ముడిసరుకును పరిశ్రమలకు అంతరాయం లేకుండా సరఫరా చేయటం, రైతులకు న్యాయమైన ధర వచ్చేట్లు భరోసా ఇవ్వటం. ఈపాటి ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చేస్తే, పదుల లక్షల ఎకరాల పల్లపు భూమిలో వరి లాంటి పంటలకు బదులు ఇంధనాన్ని ఉత్పత్తి చేయవచ్చు. మనం భారత్‌లో 11.5 కోట్ల ఎకరాలలో వరి పండిస్తున్నాం. ఇందులో రెండు శాతం సుమారు 25 లక్షల ఎకరాల భూమిని గనక నేపియర్ గ్రాస్ సాగుకు పూర్తిస్థాయిలో మళ్లించగలిగి, దాన్ని కంప్రెస్ చేసిన బయోగ్యాస్ (సీబీజీ)గా మార్చగలిగితే సూర్యరశ్మి పుష్కలంగా ఉన్న మన భూముల్లో 2 కోట్ల టన్నుల సీబీజీని ఏటా ఉత్పత్తి చేయగలం. భారతదేశానికి వంటగ్యాస్ దిగుమతి అవసరం ఉండదు. ప్రస్తుత ధరల ప్రకారం సుమారు రూ.1,50,000 కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోగలం. భూమి ఉత్పాదకత పెరిగినకొద్దీ, మనం ఇంధన పంటల్ని ఎక్కువ ప్రాంతాలకు విస్తరించవచ్చు. ఆహార భద్రతకు ఢోకా లేకుండానే ఇవన్నీ చేయవచ్చు.అదే విధంగా, భారత్‌లో 21 కోట్ల ఎకరాల అటవీ భూమి ఉంది. మన వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన ఇంధన చెట్లను అడవుల్లో పెంచవచ్చు. ఉదాహరణకు, పాప్లర్(కాటన్ వుడ్), విల్లో(కొండ గన్నేరు), యూకలిప్టస్ (నీలగిరి), సరుగుడు, గుమ్మడి టేకు(గహర్), మాంగియం (మక్కం), సుబాబుల్ తదితరాలు. ఒక ఎకరం అటవీ భూమిలో ఏటా ఎకరాకు 5 టన్నుల జీవ పదార్థాన్ని (బయోమాస్) సాధారణంగా ఉత్పత్తి చేయవచ్చు. జీవ పదార్థాన్ని ఇంధనంగా పూర్తిస్థాయిలో మార్చటానికి ఇప్పుడు సాంకేతికతలు(పైరోలిసిస్, ఎంజైమ్‌లు) అందుబాటులో ఉన్నాయి. అటవీ భూమిలో సుమారు 10శాతం గనక ఇంధన వృక్షాల పెంపకానికి కేటాయించగలిగితే బయోఇథనాల్, జీవ ఇంధన నూనె, జీవ కర్బనం లేదా సుమారు 2.5 కోట్ల టన్నుల దిగుమతి నూనెకు సమానమైన విలువగల రసాయనాల్ని మనం ఉత్పత్తి చేయగలం.మన భూ విస్తీర్ణం, సారవంత నేలలు, ఉష్ణమండల వాతావరణం, ప్రస్తుత సాంకేతికత, విస్తృత స్థాయి వల్ల సగటు వ్యయం తగ్గటం... ఇవన్నీ మనం హైడ్రోకార్బన్ల దిగుమతి మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా చేస్తున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను విముక్తం చేసే అద్భుతావకాశాన్నిస్తున్నాయి. ఒక కీలక విధాన నిర్ణయం అమలు ‘ఇన్ని రకాల లాభాలను సమాజానికి అందించటం’ అరుదుగా మాత్రమే జరుగుతుంది. మనం ఈ అవకాశాన్ని తక్షణం అందిపుచ్చుకోవాలి.



# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

రాష్ట్రంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి చెత్తలేకుండా చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, నెల్లూరు నగరాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే.. ఎలక్ట్రిక్ ఆటోలను వర్చువల్‌గా ప్రారంభించారు. బాగా పని చేసిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఇంట్లో ఎవరికి వారే.. తడి, పొడి చెత్తను వేరు చేసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మే 23 నుంచి జూన్ 20 వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం చేపట్టాం. ఆగస్టు 26 నాటికి 1140 ఈ–ఆటోలు అందుబాటులోకి వస్తాయి. 108 సమగ్ర ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 'ప్రజారథం' కార్యక్రమం ద్వారా చెత్తను కొనుగోలు చేసి.. నిత్యావసర వస్తువులు అందజేశాం. దీనికోసం ఇప్పటి వరకు రూ.16 కోట్లు ఖర్చు చేశాం. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు అన్నారు. ఎవరి ఇంటిపై వాళ్లే కరెంటు తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చెత్త నిర్వహణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని

పేర్కొన్నారు. ఏపీలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తలేకుండా చేస్తామని చెప్పారు. ఈ నెలలోనే తల్లికి వందనం కింద డబ్బులు వేస్తామని వెల్లడించారు. అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికులకు తల్లికి వందనం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రౌడీయిజం చేస్తే ఎవరినీ వదిలిపెట్టనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అమృత్ 2.0 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. గొడ్డలి పార్టీతో పెద్ద సమస్య వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్‌గా మారారని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ చేస్తే ఓ వ్యక్తి చనిపోయాడని తెలిపారు. పోస్టర్లు, కటౌట్‌లకు పొట్టేళ్లను బలి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ లక్ష్యం ప్రజలను దోపిడీ చేయడమేనని విమర్శించారు. తన జీవితంలో ఇలాంటి రాజకీయాలు చూడలేదని అన్నారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇదిలావుంటే రాష్ట్రాభివృద్ధిలో మేము సైతం అంటూ కొందరు ఉదారతను చాటారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు తమ వంతు విరాళాలను అందించారు. అమరావతి కోసం గుడివాడకు చెందిన సాయిశ్వేత బంగారు గాజులు అందించారు. ఆమె కుమారుడు దాచుకున్న కిడ్డీ బ్యాంక్ నగదును కూడా అమరావతి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. మరోవైపు గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి కోసం అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ.3 కోట్ల విరాళం ఇచ్చారు. గతంలోనూ వారు గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి రూ.3 కోట్లు విరాళం ఇచ్చారు.

# ఓ మంచి ఆలోచనతో ముందడుగు వేద్దాం..

స్వచ్ఛమైన ఆనందమయ ఆరోగ్య ఆంధ్ర నిర్మాణంతో స్వర్ణాంధ్ర సాకారానికి ఓ మంచి ఆలోచనతో ముందడుగు వేయాలని.. సమాజంలో మార్పు మన నుంచే మొదలుకావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. నెలలో మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎనికేపాడులోని ఎస్ఆర్‌కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బల్క్ వేస్ట్ జనరేటర్లు థీమ్‌తో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటిన తర్వాత జిల్లా మహిళా, శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యత మరచి పాలిథిన్ సంచిని వినియోగించి బయటపడేయడం వల్ల సమాజానికి ఎంత నష్టం కలుగుతుందో క్షుణ్నంగా వివరించారు. ప్రకృతి మనకు అమూల్యమైన వరమని, దాన్ని పరిరక్షించడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రోజువారీ జీవితంలో ఎ÷–లాస్టిక్ ముఖ్యంగా సింగిల్–యూజ్ ఎ÷–లాస్టిక్‌కు దూరంగా ఉండాలని.. గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. ఎ÷–లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్నాయని, మానవ ఆరోగ్యంతో పాటు జీవ వైవిధ్యానికీ తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయని తెలిపారు. ఇంటి నుంచే చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, పరిశుభ్రతను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల బహుళ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026 ప్రకారం చెత్తను మూలంలోనే నిర్వహించి, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం నినాదంతో ముందుకెళ్తూ బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించడం, ప్రోత్సహించే విధానాలను వివరించారు. రోజుకు 100 కిలోలు లేదా అంతకంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి చేయడం, 20 వేల చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉండటం, రోజుకు 40 వేల లీటర్లు లేదా అంతకంటే ఎక్కువ నీటిని వినియోగించడం. ఈ మూడింటిలో ఏదో ఒకటి వర్తించినా ఆ సంస్థను బల్క్ వేస్ట్ జనరేటర్‌గా పరిగణించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞతో పాటు ఇంటి వద్ద వ్యర్థాల నిర్వహణలో చురుగ్గా వ్యవహరిస్తున్న మహిళలకు జ్యూట్ బ్యాగులు, ప్రశంసా పత్రాలు అందించారు. అదేవిధంగా గ్రీన్ అంబాసిడర్లను సగౌరవంగా సత్కరించారు. ళాశాల ప్రిన్సిపల్ డా. కె.రమేష్.. నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లు కొత్త అవకాశాలు, ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధికి ఎలా దోహదం చేస్తాయో వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమైందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీవో టి.సీతామహాలక్ష్మి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వెంకటలక్ష్మి, డీఎల్‌పీవో రాఘవన్, ఎంపీడీవో పార్థసారథి, తహశీల్దార్ లలిత, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై కారం చల్లిన రైతులు

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూసేకరణ వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. భూములు స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వెళ్లగా రైతులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహానికి గురైన కొందరు రైతులు పోలీసులపై కారం చల్లి, రాళ్లు, కుర్చీలు విసురుతూ దాడికి దిగారు.ఈ ఘటనలో పలువురు కానిస్టేబుళ్లు, ఎస్ఐలు, సీఐలకు గాయాలయ్యాయి. గాయపడిన అధికారులకు చికిత్స అందించారు. డీసీపీకి కూడా గాయాలైనట్టు తెలుస్తోంది. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సుమారు 600 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమంటూ రైతులు ఐదు రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.భూముల స్వాధీన ప్రక్రియ కోసం శనివారం ఉదయం హైడ్రా అధికారులు భారీ బందోబస్తుతో అక్కడికి చేరుకున్నారు. అధికారులు ముందుకు సాగేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. ఉదయం మొదలైన ఉద్రిక్తత సాయంత్రానికి మరింత తీవ్రరూపం దాల్చింది. పరిస్థితి చేదాటడంతో డీసీపీ యోగేశ్ గౌతమ్ రంగంలోకి దిగారు. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, చర్చలు జరిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా కలెక్టర్‌కు విన్నవించుకునే అవకాశం కల్పిస్తారని చెప్పారు. రైతుల అనుమతి లేకుండా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోరని హామీ ఇచ్చారు. అయినప్పటికీ.. రైతులు వెనక్కి తగ్గలేదు. నిరసన కొనసాగిస్తామని భీష్మించారు.

# 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్–1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్–1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

# నెరవాటి స్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుకలు

**నంద్యాల ప్రతినిధి. జూలై 18 . (నంది పత్రిక ):** నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం ఇన్వెస్టిచర్ వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం విద్యార్థుల ప్రార్థనా గీతం స్వాగత గీతంతో ప్రారంభమైంది. అనంతరం విద్యార్థులు క్రమశిక్షణతో నిర్వహించిన మార్చ్‌పాస్ట్ అందరినీ ఆకట్టుకుంది. తర్వాత విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్లు, సాంస్కృతిక నృత్యాలు సభికులను విశేషంగా అలరించాయి. ఈ ప్రదర్శనల ద్వారా నాయకత్వం, దేశభక్తి, సామాజిక బాధ్యత, ఐక్యత వంటి విలువలను ప్రతిబింబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుష్మిత ఆర్., ఐపీఎస్., నంద్యాల జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, వి. రామచంద్రరావు, నంద్యాల సీనియర్ న్యాయవాది విద్యార్థి నాయకులకు జెండాలు, బ్యాడ్జీలు, శాష్‌లు అందజేసి హెడ్ బాయ్, హెడ్ గర్ల్, వైస్ హెడ్ బాయ్, వైస్ హెడ్ గర్ల్ మరియు నాలుగు హౌస్ కెప్టెన్లను అధికారికంగా బాధ్యతల్లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుష్మిత ఆర్., ఐపీఎస్. మాట్లాడుతూ నాయకత్వం అనేది ఒక పదవి కాదని, అది బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యం, సేవాభావంతో ముందుకు సాగాలని, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. వి. రామచంద్రరావు మాట్లాడుతూ నిజాయితీ, న్యాయం, నైతిక విలువలు ప్రతి విద్యార్థి జీవితానికి పునాది కావాలని అన్నారు.



నాయకత్వ బాధ్యతలు చేపట్టిన విద్యార్థులు తమ ప్రవర్తనతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, వినయం, బాధ్యత, సమానత్వంతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు మంచి సంభాషణా నైపుణ్యాలు పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎన్. ఆనంద్ గుప్తా, కరస్పాండెంట్ ఎన్. రోహిత్, ప్రిన్సిపాల్ మొమీన్ ఫరాయతుల్లా ప్రసంగిస్తూ విద్యార్థి నాయకులను అభినందించారు. నాయకత్వం అంటే సేవ, క్రమశిక్షణ, బాధ్యత, జట్టుగా పనిచేసే తత్వమని పేర్కొంటూ ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను వెలికితీసుకుని పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. చివరిగా విద్యార్థి నాయకులు ప్రమాణ స్వీకారం చేయగా, జాతీయ గీతాలాపనతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కడప రిమ్స్ ఆసుపత్రిలో నూతన డిజిటల్ రేడియోగ్రఫీ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి, టిడిపి జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి..

**కడప జూలై 18, నందిని ప్రతినిధి.** కడప నగరంలో రిమ్స్ ఆసుపత్రిలో సి ఎస్ ఆర్ నిధుల కింద ఎల్ ఐ సి ఆఫ్ ఇండియా మంజూరు చేసిన రూ. రెండు కోట్లతో ఏర్పాటు చేసిన నూతన 1000 ఎం ఎ డిజిటల్ రేడియోగ్రఫీ సెంటర్ ను ఆంధ్రప్రదేశ్ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి, టిడిపి జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య పరీక్ష సదుపాయాలను అందించేందుకు ఈ డిజిటల్ రేడియోగ్రఫీ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు, సామాజిక బాధ్యతతో సి ఏ ఎస్ ఆర్ ముందుకు వచ్చి ఆ నిధులను సమకూర్చిన ఎల్ఐసి యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ శర్వాణి రమేష్, రిమ్స్ ఆసుపత్రి అధికారులు వైద్యులు, ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## కడప వైయస్సార్ పి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ..

**నంది ప్రతినిధి, జులై 18, కడప జిల్లా.** వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ఘనంగా జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్ విడుదల. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పోస్టర్ ఆవిష్కరణ. జగన్ 2.0 సూపర్ యాపులు ప్రజలకు చేరవేయాలని నాయకులకు పిలుపు. పార్టీ కార్యక్రమాల సమాచారాన్ని అందించే వేదిక సూపర్ క్యాప్ వినియోగించాలని సూచన. వైయస్ఆర్పి శ్రేణులు భారీగా హాజరైన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం పోస్టర్ విడుదల విజయవంతం కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు




# ఐదు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు..





## ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోరిన ఎంపీఈఓలు

**నంద్యాల సిటీ బ్యూరో జూలై 18 ( నంది పత్రిక )** వ్యవసాయ శాఖలో గత 12 నుంచి 15 ఏళ్లుగా మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (ఎంపీఈఓలు)గా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని నంద్యాల జిల్లా ఎంపీఈఓలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీఈఓల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, 2014లో డీఎస్సీ ద్వారా నియమితులైన తమకు ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే వేతనం అందుతోందన్నారు. "సమాన పనికి సమాన వేతనం" సూత్రం ప్రకారం నెలకు రూ.35 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న తమను శాంక్షన్ పోస్టుల్లోకి మార్చి, టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో తమకు అవకాశం కల్పించాలని, మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ లీవ్‌తో పాటు ఇతర సెలవు సౌకర్యాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ వ్యవసాయ రంగంలో ఈ-క్రాప్ నమోదు, యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ, ఏపీఎఫ్ఆర్ కింద రైతుల నమోదు, సీసీఆర్సీ కార్డుల జారీ, పంటల బీమా, "పొలం బడి", "పొలం పిలుస్తోంది" వంటి కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తున్నామని ఎంపీఈఓలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని తమ సమస్యలను పరిష్కరించి, ఉద్యోగాలను శాశ్వతీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## గుంటూరులో జరిగే అండర్ -21 అంతర్ జిల్లాల హాకీ పోటీలకు నంద్యాలజిల్లా జట్టు సిద్ధం.

### జాతీయ స్థాయిలో రాణించి నంద్యాల పేరును దశదిశలా చాటాలని క్రీడాకారులకు పిలుపు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్న చాణిక్య రాజు.

**నంద్యాల సిటీ బ్యూరో జులై 18 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా హాకీ క్రీడాకారులు మరో ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు సిద్ధమయ్యారు. గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ లో ఈ నెల 19 నుండి 22వ తేదీ వరకు నిర్వహించనున్న అండర్ -21 ఇంటర్ డిస్టిక్ హాకీ మెన్ ఛాంపియన్షిప్ పోటీలకు నంద్యాల జిల్లా నుండి వెంకట సాయి (గవర్నమెంట్ కాలేజ్ జూనియర్ నంద్యాల), అభినయ్ నీరజ్ (వెలాసిటీ జూనియర్ కాలేజ్, నంద్యాల), వంశీ (గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నంద్యాల), అసద్ హుస్సేన్ (న్యూక్లియస్ జూనియర్ కాలేజ్ నంద్యాల), నిఖిల్ (గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నంద్యాల), మిద్ద శిరీష్ కారుణ్య (నారాయణ జూనియర్ కాలేజీ, నంద్యాల), రాజశేఖర్ (ఎస్ పి జి హై స్కూల్ నంద్యాల), అనుభవ్ (గుడ్ షపర్డ్ స్కూల్ నంద్యాల), రాజేశ్వర్ రెడ్డి (గుడ్ షెఫర్డ్ స్కూల్ నంద్యాల), పవన్ కుమార్ (గుడ్ షెఫర్డ్ స్కూల్ నంద్యాల), అమీర్ (గుడ్ షపర్డ్ స్కూల్ నంద్యాల) క్రీడాకారులను నంద్యాల జిల్లా హాకీ అసోసియేషన్ ప్రతినిధులు, ఏపీ హాకీ అధ్యక్షుడు చాణిక్యరాజు ఆధ్వర్యంలో నేడు స్థానిక ఎస్పీజీ హై స్కూల్ గ్రౌండ్ నందు ఎంపిక చేశారు. ఈ పోటీలలో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టుకు హాకీ నంద్యాల జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథి గా హాజరైన ఎస్ స్పీజీ హై స్కూల్ హెచ్. ఎం నళిని, ఏపీ హాకీ అధ్యక్షుడు చాణిక్యరాజు, జిల్లా జాయింట్ సెక్రెటరీ దివాకర్, ట్రెజరర్ స్టీఫెన్ జెర్సీలను బహుకరించారు. ఈ సందర్భంగా ఏపీ హాకీ అధ్యక్షుడు చాణిక్య రాజు మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా, మానసిక ఉల్లాసాన్ని, జీవితంలో క్రమశిక్షణను అలవరుస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. నంద్యాల జిల్లా హాకీ క్రీడాకారులు ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించి జిల్లా పేరును దశదిశలా చాటాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్పీజీ హెచ్. ఎం నళిని మాట్లాడుతూ... జాతీయ క్రీడ అయిన హాకీని ఎంచుకోవడం అభినందనీయం అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచి నంద్యాల జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాకీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం రాజు, సెక్రెటరీ సునీల్ ముత్యం, జాయింట్ సెక్రెటరీ దివాకర్, ట్రెజరర్ స్టీఫెన్ మరియు టీం కోచ్ శ్రావణ్ కుమార్, ఎస్పీజీ వ్యాయామ ఉపాధ్యాయుడు వినీత్ , క్రీడాకారులు పాల్గొన్నారు.



## పంటల బీమాను ప్రభుత్వమే భరించాలి. అన్నదాతలపై భారం వేయడం సరికాదు.

### మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి.

**మంత్రాలయం జూలై18 (నందిదినపత్రిక ప్రతినిధి)** ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో వర్షభావం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అన్నదాతలు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం రైతులు వెంటనే పంటలవారీగా నిర్ణయించిన పంటల బీమానగదుచెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించింది. అయితే ఇప్పటి కే రైతు లు పెట్టుబడులు పెట్టి పూర్తి గా ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి తరుణంలో బీమా నగదు చెల్లించాలని అన్నదాతల పై భారం వేయడం సరికాదని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి డిమాండ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కరోనాకష్టాలు ఉన్నప్పటికీ రైతులు సాగు చేసిన పంటలకుప్రభుత్వమే బీమా చేయించే దని గుర్తు చేశారు. అన్నదాతలకు అండగా ఉంటామని చెప్పిన ప్రభుత్వం ఇలాంటి భారం మోపడం సరికాదని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి గత ప్రభుత్వం లో మాదిరిగానే ఈప్రభుత్వం కూడా పంటల బీమా రైతులతో కాకుండా ప్రభుత్వమే చెల్లించాలని కోరారు.



## ఏ ఆర్ అదనపు ఎస్. పి. బి. రమణయ్య.

### జిల్లా ఎస్. పి. నచికేతన్ విశ్వనాథ్ ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో "స్వర్ణాంధ్ర-స్వచ్ఛ‌శీ ద్ర" కార్యక్రమం



**నంది ప్రతినిధి, జూలై 18, కడప జిల్లా..** మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా జీవించవచ్చునని ఏఆర్ అదనపు ఎస్. పి. బి. రమణయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్. పి. నచికేత్ విశ్వనాథ్ ఐ. పి. ఎ స్. ఆదేశాల మేరకు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం ప్రతిస్తాత్మకంగా పెట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ శీ ద్ర కార్యక్రమం శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ రావడంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ. ఆర్. ఎస్ పి. బి రమణయ్య మాట్లాడుతూ స్వచ్ఛత అనేది ప్రతి పౌరుడు విధి అని. స్వర్ణాంధ్ర స్వచ్ఛ శీ ద్ర కార్యక్రమం ద్వారా మనం మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో తోడ్పడాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన వాతావరణంలో మనసు ప్రశాంతంగా ఉంది, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, మరింత సమర్థవంతంగా నిధులు నిర్వహించవచ్చునని తెలిపారు. నేడు మనం తీసుకునే చర్యలు భావితరాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని గుర్తించి, పరిశుభ్రత పై మనం చూపే శ్రద్ధ వారికి మంచి జీవన వాతావరణం అందించడంలో కీలకమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఐ లు, ఆర్. ఎ స్. ఐ లు, ఏ. ఆర్. సిబ్బంది పాల్గొన్నారు



## మైదుకూరులో ఘనంగా 'జగనన్న 2.0' సూపర్ యాప్ లోగో ఆవిష్కరణ

**ఖాజీపేట , జూలై 18 (నంది ప్రతినిధి):** మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో శనివారం 'జగనన్న 2.0' సూపర్ యాప్ లోగోను మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు సూపర్ యాప్ పోస్టర్లను విడుదల చేసి, పార్టీ శ్రేణులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు పార్టీ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారం సులభంగా చేరవేసేందుకు జగనన్న 2.0 సూపర్ యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ప్రతి గ్రామంలో యాప్‌ను ప్రజలకు చేరవేసి, పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులంతా సమిష్టిగా పనిచేసి ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ డి. మురళీమోహన్ రెడ్డి, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ పి.వి. రాఘవ రెడ్డి, రాష్ట్ర ఐటీ వింగ్ జనరల్ సెక్రటరీ పాలకొలను లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కొండారెడ్డి, కూనవారిపల్లి భూమన సుబ్బారెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డితో పాటు మైదుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పోతురాజు దేవతా పోలాన్ని కాపాడిన భూసిరెడ్డి,శేషిరెడ్డి.



**శిరివెళ్ల (నంది పత్రిక ):-** సిరివెళ్ల మండల పరిధిలోని కామినేని పల్లె గ్రామంలో వెలసినటువంటి శ్రీ పోతురాజు స్వామి దేవత పొలం ఆక్రమణకు గురికాగా ఆ పొలాన్ని సర్వే మరియు రెవెన్యూ అధికారుల ద్వారా వెలికి తీసినట్లు పోతురాజు దేవతా పూజారులైనటువంటి చింతకుంట్ల బూసిరెడ్డి, చింతకుంట్ల శేసిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం సచివాలయ సర్వేయర్లు గ్రామ తలారులు గ్రామ ప్రముఖులు పోతురాజు దేవత పూజారులు ఇతర ప్రముఖుల సమక్షంలో మండల సర్వేయర్ చిన్న మల్లయ్య సర్వే కొలతలు నిర్వహించి నాలుగు హద్దులు చూపించి కబ్జాకు గురైనటువంటి పొలాన్ని పోతురాజు దేవతకు చెందేలా సర్వే రాళ్లు చూపించినట్లు కోటపాడు మరియు కామినేని పల్లె గ్రామ ప్రజలు తెలియజేశారు. ఈ సందర్భంగా చింతకుంట్ల బూసిరెడ్డి చింతకుంట్ల శేసిరెడ్డి మాట్లాడుతూ పూర్వం నుండి అనాదిగా వస్తున్న గ్రామదేవతలు మరియు ఆయా గ్రామాలలో వెలిసినటువంటి ప్రభుత్వ దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరులపై ఉన్నదని తెలియజేశారు. ఈ సందర్భంగా పోతురాజు దేవతా భూమిని వెలికి తీసినందుకు చింతకుంట్ల బూసిరెడ్డిని శేసిరెడ్డిని పలువురు అభినందించారు.

# ఆటో డ్రైవర్ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 18:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి 50వేల రూపాయల చెక్కును అందజేశారు. వేల్పనూరు క్యాంప్ ఆఫీసులో శనివారం ఆటో డ్రైవర్ నాగేష్ కుటుంబానికి ఎమ్మెల్యే బుడ్డా చెక్కును అందజేశారు. రెండు సంవత్సరాల క్రితం ఆటో డ్రైవర్ నాగేష్ ఓ ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆటో డ్రైవర్ కు ముగ్గురు సంతానం కాగా అకస్మాత్తుగా ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లి పోయింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డు మధుసూదన్ రెడ్డి ఆ కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. శనివారం మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆ కుటుంబానికి చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సాయం అందజేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, వడ్డు మధుసూదన్ ఇంటికి ఆటో డ్రైవర్ కుటుంబం కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాధే శ్యామ్ స్వచ్ఛంద సంఘం విజ్ఞప్తి మేరకు తాగునీటి సదుపాయం కొరకు..



**బేతంచెర్ల జులై 18 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణంలోని రాధే శ్యామ్ స్వచ్ఛంద సంఘం కమిటీ సభ్యులు గత 20 సంవత్సరాలుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎన్నికల ప్రచార సమయంలో రాధే శ్యామ్ స్వచ్ఛంద సంఘం కమిటీ సభ్యులు గౌరవనీయులు డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకున్న కోట్ల సుజాతమ్మ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, శాశ్వత తాగునీటి సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఆ హామీని నెరవేర్చే దిశగా, కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు శనివారం తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమాన్ని గౌరవనీయులు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి నిర్వహించారు.ఈ సందర్భంగా రాధే శ్యామ్ స్వచ్ఛంద సంఘం కమిటీ సభ్యులు మాట్లాడుతూ, 20 సంవత్సరాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న తమ సమస్యను గుర్తించి, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కు,శనివారం పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## దేవెగౌడ ఇంట విషాదం... తీవ్ర విచారం వ్యక్తం చేసిన చంద్రబాబు, లోకేశ్

మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన అర్థాంగి చెన్నమ్మ శనివారం కన్నుమూశారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి చెన్నమ్మ మాతృమూర్తి. ఆమె మృతివార్త తెలియగానే పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ విచారాన్ని వ్యక్తం చేశారు. “శ్రీమతి చెన్నమ్మ గారు కన్నుమూశారని తెలిసి తీవ్ర విచారం కలిగింది. మాజీ ప్రధాని దేవెగౌడ గారికి, కేంద్ర మంత్రి కుమారస్వామి గారికి, వారి కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నాను. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, ఈ తీవ్ర దుఃఖ సమయంలో ఆ కుటుంబానికి ధైర్యం చేకూరాలని ప్రార్థిస్తున్నాను“ అని చంద్రబాబు పేర్కొన్నారు.

# బేతంచర్లలో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ ఎఫ్) ప్లాంట్ ప్రారంభం





**- పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం**

**-డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**

**బేతంచెర్ల జులై 18 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా,పర్యావరణ హితంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడింది.బేతంచర్ల నగర పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లిమెటీరియల్ రికవరీ ఫెసిలిటీ( ఎంఆర్పిఎఫ్ ) ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి, శనివారం గౌరవ డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మరియు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజా కుమారి గనియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఈ ప్లాంట్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి పట్టణంలో ఆధునిక వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసి, చెత్తను శాస్త్రీయంగా సేకరించడం, వర్గీకరించడం, పునర్వినియోగం చేయడం ద్వారా, పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రజారోగ్యాన్ని కూడా కాపాడుతున్నామని పేర్కొన్నారు.మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ ద్వారా తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా శుద్ధి చేసి, పునర్వినియోగానికి అనువైన పదార్థాలను తిరిగి, వినియోగంలోకి తీసుకు రావడం సాధ్యమవుతుందని తెలిపారు. దీనివల్ల చెత్త డంపింగ్ యార్డులపై భారం తగ్గడంతో పాటు, కాలుష్య నియంత్రణకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు, ప్రతి కుటుంబం ఇంటి వద్దే తడి,పొడి చెత్తను వేరు చేసి, నగర పంచాయతీ సిబ్బందికి అందించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యం తోనే, పరిశుభ్రత కార్యక్రమాలు విజయవంతమవుతాయని, బేతంచర్లను రాష్ట్రంలోనే ఆదర్శ పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దేందుకు, ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని,ఆధునిక సాంకేతికతతో,వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా,భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మీ ఖాళీ స్థలం.. ఐటీ కంపెనీలకు చిరునామా కావచ్చు..!

**పారిశ్రామికంగా దూసుకెళ్తున్న కడపకు మరో సువర్ణావకాశం**

**ఆదాయ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపు**

**కడప, బ్యూరో చీఫ్ జూలై 18: నంది పత్రిక** రాష్ట్రంలో ఐటీ రంగాన్ని వేగంగా విస్తరించడంతో పాటు జిల్లాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐటీ మౌలిక వసతుల ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.వైఎస్ఆర్ కడప జిల్లా శరవేగంగా పారిశ్రామికాభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పోర్టల్ జిల్లా ప్రజలకు మరింత ప్రయోజనకరంగా చక్కటి ఉపాధి, ఆదాయ రంగాల పైపు నడిపించే మార్గదర్శి మారనుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను సమగ్ర పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక పార్కు అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతోందని, భారీ, మధ్యతరహా పరిశ్రమలతో పాటు వేలాది సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

**కడప జిల్లా ప్రజలకు సువర్ణావకాశం ఎందుకంటే..?**

సిమెంట్ పరిశ్రమలకు కడప ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, అదే సమయంలో సౌర విద్యుత్, వస్త్ర పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ఖనిజ ఆధారిత పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో కూడా పెట్టుబడులు పెరుగుతున్నాయి. వేలాది ఎకరాల్లో వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతుండటంతో జిల్లా పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా రూపుదిద్దుకుంటోంది. అదేవిధంగా రాష్ట్రానికే తలమానికంగా అభివృద్ధి చెందుతున్న కోపర్తి ఎలక్ట్రానిక్ తయారీ సముదాయం దశలవారీగా విస్తరిస్తూ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక రంగాల్లో కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో కొపర్తి కేంద్రంగా మరిన్ని జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్స్ సంస్థలు జిల్లాకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇండస్ట్రీయల్ మాన్యుఫాక్చురింగ్ క్లస్టర్ ను అధిగమించి సరిపడా స్థలాలు, భవనాలు అవసరం అవుతుంది. మరోవైపు జిల్లాను అన్ని పెద్ద నగరాలకు అనుసంధానం చేసే జాతీయ రహదారులు విస్తరించాయి. పారిశ్రామిక అవసరాలకు అవసరమైన రవాణా వ్యవస్థ జిల్లాకు ఉంది. జాతీయ స్థాయి కనెక్టివిటీలో రైల్వే, విమానయాన సర్వీసులు జిల్లా ప్రజలకు చక్కటి అవకాశాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఐటీ మౌలిక వసతుల పోర్టల్ జిల్లా ప్రజలకు అరుదైన అవకాశంగా నిలువనుంది. పెద్ద పెద్ద భవనాల యజమానులే కాకుండా చిన్న వాణిజ్య భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీ అంతస్తులు, ఖాళీ భూములు కలిగిన వారంతా తమ ఆస్తులను ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ఐటీ సంస్థలు, స్టార్టప్‌లు, గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు (జీసీసీలు), ఇతర సాంకేతిక సంస్థలకు లీజుకు ఇవ్వడం లేదా విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.

**డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్,**

**వైఎస్ఆర్ కడప జిల్లా.** రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ట్ట్రిజూం://ఱఅటటఞ.ఖజూ.ప్రశీజ.అఅ/చ/ప్ట్రశీఎవ/శ్రీఖఅఎఅఅ ప్ర- పోర్టల్‌లో ఆస్తుల వివరాలను నమోదు చేస్తే అవి నేరుగా పెట్టుబడిదారుల దృష్టికి చేరుతాయని, నమోదు ప్రక్రియ పూర్తిగా ఉచితమని తెలిపారు. ఈ డిజిటల్ వేదిక ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై సమగ్ర సమాచారం పెట్టుబడిదారులకు చేరి కొత్త పరిశ్రమలు, ఐటీ సంస్థలు జిల్లాకు రావడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఐటీ సంస్థల రాకతో స్థానిక యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, 



రవాణా, గృహవసతి, హోటళ్లు, వ్యాపార సేవలు, విద్య, ఇతర అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ వివరించారు. తద్వారా జిల్లా ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు కడపను రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామిక, ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యానికి ఈ పోర్టల్ దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు అందువల్ల చిన్న, పెద్ద వాణిజ్య భవనాలు, కార్యాలయ స్థలాలు లేదా ఖాళీ భూములు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఐటీ మౌలిక వసతుల పోర్టల్‌లో తమ ఆస్తుల వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు.

మరిన్ని వివరాల కోసం జిల్లా ఐటీ మేనేజర్ (90108 21844) ను సంప్రదించవచ్చని తెలిపారు.

# కడప ఉక్కు పరిశ్రమ కొప్పర్తి పారిశ్రామిక వాడపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఇక సహించం



కడప జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన కడప ఉక్కు పరిశ్రమ ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడం, కొప్పర్తి పారిశ్రామిక వాడ అభివృద్ధి నత్తనడకన సాగడం ప్రభుత్వాల ఘోర వైఫల్యానికి నిదర్శనం వాటి అభివృద్ధికి కృషి చేయాలని ాూ×దీూఖ రాష్ట్ర అధ్యక్షులు జగన్ రాథోడ్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించడం ప్రజలను మోసం చేయడమే అన్నారు.కడప జిల్లాకు జరిగిన అన్యాయాన్ని ఇకపై ప్రజలు సహించరు అన్నారు.కడప ఉక్కు పరిశ్రమను వెంటనే పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలి అన్నారు.కొప్పర్తి పారిశ్రామిక వాడను పేరుకు మాత్రమే పరిమితం చేయకుండా పరిశ్రమలు స్థాపించేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి అన్నారు.యువతకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఉపాధి కోసం వేలాది మంది యువకులు జిల్లాను విడిచి వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి, గడువులతో కూడిన అమలు షెడ్యూల్‌ను ప్రజల ముందుంచాలి అన్నారు.లేనిపక్షంలో కడప జిల్లా ప్రజలు, యువత, ప్రజాసంఘాలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా భారీ స్థాయి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్యు నగర నాయకులు ఆనంద్ రెడ్డి, దేవానంద్,ఈశ్వరయ్య,మల్లికార్జున, అవినాష్ గిరీష్,తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ పోటీలు






## -జాతీయ స్థాయిలో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపిక

**నంద్యాల ప్రతినిధి. జూలై 18 . (నంది పత్రిక ):**జూలై 20వ తేదీ అంతర్జాతీయ చెస్ దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో,నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో శనివారం నంద్యాలలో రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి సీనియర్ ఓపెన్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా,నంద్యాల జిల్లా క్రీడా భారతి అధ్యక్షులు, శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్,రామకృష్ణ విద్యా సంస్థల డైరెక్టర్ హేమంత్ రెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూతల్లిదండ్రులు,విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. కేవలం చదువు మాత్రమే ఉంటే సరిపోదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం వారి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. ఈ చదరంగం క్రీడ వారిలో ఏకాగ్రత పెంచుతుందని అన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో కృత్రిమ మేధ వినియోగం పెరిగితే వారి మెదళ్లు సృజనాత్మకంగా ఆలోచన చేసే శక్తిని కోల్పోతారని,చదరంగం వారి మేధో శక్తికి పదును పెడుతుందని అన్నారు.సుధాకర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో చెస్ క్రీడకు ప్రాచుర్యం పెరగడానికి జిల్లా చెస్ సంఘం కృషి ప్రశంసనీయమన్నారు. క్రీడలలో ఓటమి చెందిన వారు నిరుత్సాహపడకుండా నిరంతర సాధన ద్వారా విజయాలు సాధించాలని కోరారు.హేమంత రెడ్డి మాట్లాడుతూ రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇందులో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర సంఘం తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ నిర్వాహకులు రామసుబ్బారెడ్డి, చీఫ్ ఆర్బిటర్ వెంకట కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 264 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, అందులో 124 మంది ఫీడే రేటింగ్ ఉన్న క్రీడాకారులని తెలిపారు. ఆదివారం సాయంత్రం ముగింపు ఉత్సవంలో విజేతలకు పతకాలు, ట్రోఫీలు బహూకరించడం జరుగుతుందని తెలిపారు.డాక్టర్ రామకృష్ణారెడ్డి రిబ్బన్ కత్తిరించి ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ లాంచనంగా ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రవి కృష్ణ,హేమంత రెడ్డి చెస్ బోర్డు పై పావులు కలిపి చదరంగం పోటీలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్, రామకృష్ణ విద్యా సంస్థల డైరెక్టర్ హేమంత రెడ్డి,చీఫ్ ఆర్బిటర్ వెంకట కుమార్,జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం కార్యవర్గ సభ్యులు, కర్నూలు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాస్,లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ ,జోన్ చైర్మన్ సోమేశుల నాగరాజు, సంయుక్త కార్యదర్శి అమిదేల జనార్ధన్, సహా కోశాధికారి డాక్టర్ శ్రవణ్,సభ్యులు జగన్, జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి,ఇమామ్, రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన చదరంగం క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# జగన్ 2.ఓ యాప్ పోస్టర్ విడుదల




**బనగానపల్లె జులై 18నందిపత్రిక** వైయస్సార్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు కార్యకర్తలు బనగానపల్లె వైసీపీ కార్యాలయంలో లో శనివారం జగన్ 2.ఓ యాప్ పోస్టరను వైఎస్సార్సీపీ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అత్తర్ జాహీద్ హుస్సేన్,పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ఫైజ్,జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ అధికార ప్రతినిధి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి,వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవిరెడ్డి,రాష్ట్ర వైఎస్సార్సీపీ బిసి సెల్ కార్యదర్శి సురేష్,వైఎస్సార్సీపీ నాయకులు తోట బుచ్చిరెడ్డి, బండి బ్రహ్మానంద రెడ్డి,నీలి శ్రీనివాసులు,పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి, కరెంట్ ఆఫీసు జగదీశ్వర్ రెడ్డి, మమ్మదా,పెయింటర్ ప్రసాద్,తెలుగుపేట మద్దయ్య,వైఎస్సార్సీపీ శ్రేణులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతి వైఎస్సార్సీపీ పార్టీ కార్యకర్తతో జగన్ 2.0 సూపర్ యాప్ అనుసంధానం చేయబడుతుందని సమాచార మార్పిడి ,సమస్యల పరిష్కారానికి ఒకే వేదిక మీద కు ఈ యాప్ చెరుస్తుందని పార్టీ అధ్యక్షులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి యాప్ తీసుకువచ్చారని అన్నారు.

## వైయస్సార్ నగర్ దళిత వార్డులలో రోడ్లు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలి




**నంద్యాల ప్రతినిధి. జూలై 18 . (నంది పత్రిక ):** నంద్యాల పట్టణంలో ఉన్నటువంటి వైయస్సార్ నగర్ లో ఒక దళిత వార్డులో రోడ్డు నిర్మించకుండా కక్షపూర్వకంగా వ్యవహరించడం ప్రభుత్వాలకు తగదని డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ అన్నారు.వైయస్సార్ నగర్ లోని సామాజిక శంఖారావం భాగంగా సర్వే నిర్వహించడం జరిగింది ఈ సర్వేలో వైఎస్సార్ నగర్ వార్డు ప్రజలు వారి ఇబ్బందులను వారి సమస్యలను తెలియజేయడం జరిగింది.ముఖ్యంగా వైయస్సార్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర నుండి వరుసగా మూడు వీధులు వరకు రోడ్ల నిర్మాణం జరిగింది. నాలుగవ వీధిలో రోడ్డును ఆపేసి 5 నుంచి రోడ్డు ప్రారంభించడం అనేది జరిగింది ఎందుకంటే ఆ వీధిలో దళితులు మరియు పేదవారు ఉన్నారు వారిపై ఎందుకు వివక్షత చూపుతున్నారని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ గా ప్రశ్నిస్తున్నామని అన్నారు ఈరోజు వైఎస్ఆర్ నగర్ లో రోడ్లు లేక పూర్తిగా కాలువ లేక అక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.రాజకీయ నాయకులకు వార్డు కౌన్సిలర్లకు వారి ఓట్లతో అయినా మీకు పని ఉన్నది. ఆ వీధిలో ఉన్న సమస్యలు మీకేం పట్టవా వారి ఆవేదన మీకు పట్టదా అదేవిధంగా రోడ్ల కోసం ఎమ్మెల్యేలను అధికారంలో ఎంత అడిగినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెప్పేసి వారి ఆవేదన తెలిపారు. అదేవిధంగా ఈరోజు నంద్యాల జిల్లా కలెక్టర్ ని అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ ని అదేవిధంగా మంత్రి ఫరూక్ ని ఈ సందర్భంగా ఒక విషయం అడుగుతున్నాం దళిత ప్రాంతాలలో నివసించే వారిపై మీకు ఎందుకు చిన్న చూపు ఎందుకు ఇంత వివక్షత కక్ష చూపుతున్నారు. ఈరోజు అక్కడ ప్రజలు ఎన్నోసార్లు మేము వెళ్లి అడిగాము ఇదిగో చేస్తున్నాం అదిగో చేస్తున్నామని అంటున్నారు.తప్ప మా సమస్యలు పరిష్కరించడం లేదని వారి అంటున్నారు. తక్షణమే వైయస్సార్ నగర్ లోని అన్ని ఏరియాలలో రోడ్ల నిర్మించి సైడ్ కాలువలు నిర్మించాలని డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కమిటీగా మంత్రి ఫరూక్ ని జిల్లా కలెక్టర్ ని మున్సిపల్ కమిషనర్ ని కోరుతున్నాము.అదేవిధంగా ముఖ్యంగా దళితులు నివసించే వీధిలో ఒక రాజకీయ నాయకుడు ఉన్నందువలన ఆ వీధిలో రోడ్డును ఆపేయడం ఎంతవరకు న్యాయమని ఈ సందర్భంగా డివైఎఫ్ గా ప్రశ్నిస్తున్నామని నంద్యాల డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ తెలిపారు. వీటిని గమనించి తక్షణమే వైయస్సార్ నగర్ రోడ్ల సమస్యపై కాలువల సమస్యపై ఆ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించాలని లేనియెడల వార్డులో ఉన్న ప్రజలను కలుపుకొని మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కార్యదర్శి శివ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నందమూరి నగర్ కార్యదర్శి సాయి అధ్యక్షులు ఇర్ఫాన్ మరియు ఆ ప్రాంత ఫాదర్ ఇస్రాయెల్ మరియు ప్రసాద్, మా భాష లక్ష్మీదేవి ఇమాముషం, వినయ్ లక్ష్మన్న తదితరులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# సోనం వాంగ్ చుక్ అరెస్టును నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లతో నిరసన






**నంద్యాల ప్రతినిధి. జూలై 18 . (నంది పత్రిక ):**దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక దీక్ష చేపట్టిన ప్రముఖ పర్యావరణ వేత్త, రామ్ మెగసెసే అవార్డు గ్రహీత సోనం వాంగ్ చుక్ ఈరోజు ఉదయము అక్రమంగా అమానుషంగా దీక్ష శిబిరాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించడాన్ని నిరసిస్తూ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస్ సెంటర్లో నల్ల రిబ్బన్లతో నిరసన ఆందోళన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అధ్యక్ష వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅథితులు సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు అబులేస్. ఎస్ డి పి ఐ నాయకులు కరిముల్లా. జిక్కి భాయ్. సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పర్యావరణవేత్త, రామ్ మెగసెసే అవార్డు గ్రహీత సోనం వాంగ్ చుక్ గత నెల ఆఖరి నుండి న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారని . నేటికీ 20 రోజులు గడుస్తున్నా యని సోనం వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం విచారకరం. మోడీ సర్కార్ పాలన కేవలం కార్పొరేట్లకు అనుకూలంగా సాగుతోందని అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ లక్షలాదిమంది విద్యార్థుల్లో నిరాశను నింపింద ని పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా ఆందోళన జరుగుతున్నప్పటికీ ప్రధాని మోడీ పట్టించుకోకపోవడమే కాకుండా ఆయన దీక్ష శిబిరాన్ని ఢిల్లీ ప్రభుత్వం అర్ధాంతంగా ఈరోజు భగ్నం చేయడము దుర్మార్గమైన చర్య అని అన్నారు.ప్రముఖ సైంటిస్టుగా, ఉపాధ్యాయునిగా సోనం వాంగ్ చుక్ ఎంతో కీర్తి గడించారు. లడక్ ప్రాంతంలో తాగేందుకు మంచినీళ్లు లేని పరిస్థితుల్లో మంచు పర్వతాలను కరిగించి నీళ్లుగా మార్చారు. సియాచిన్ ఏరియాలో మైనస్ డిగ్రీలలో ఉండే చలి తీవ్రతను తట్టుకునేలా సైనికులకు వేడి కల్పించే పరికరాలను తయారు చేశారని . ఇండియా సరిహద్దుల్లో చొరబాట్లను వ్యతిరేకించి, పలు పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ఇప్పుడు దేశం కోసం, న్యాయం కోసం,

విద్యార్థుల కోసం నిరవధిక దీక్ష చేస్తున్నా ఏ మాత్రం పట్టించుకోని విదేశాలకు పరిమితమవుతూ విద్యార్థి యువజన సమస్యలపై ఏమాత్రం పట్టించుకోని పాశవిక నరేంద్ర మోడీ ప్రభుత్వం సోనం వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ కర్కశంగా మోడీ ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ సోనం వాంగ్ చుక్ కు ఏదైనా జరిగితే ప్రధాని మోడీనే బాధ్యత వహించాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి సోనం వాంగ్ చుక్ ఆరోగ్య పరిస్థితిని గమనించి, తక్షణమే ధర్మేంద్ర ప్రధాన్ ను మంత్రివర్గం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు. సామేలు. సిపిఐ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

## పొన్నాపురం దళితుల కోసం జి. ఓ నెంబర్ 1235 ప్రకారం 2ఎకరాలు స్మశాన స్థలం కేటాయించాలని ధర్నా




**నంద్యాల ప్రతినిధి. జూలై 18 . (నంది పత్రిక ):**నంద్యాల పట్టణంలోని 19వ వార్డు పొన్నాపురం, పొన్నాపురం కాలనీ లో నివసిస్తున్న ప్రజల కోసం స్మశాన వాటిక లేకపోవడం చాలా దుర్మార్గమని, ముఖ్యం గా 200కుటుంబాలకు పైగా ఉండే దళితులకు జీవో నెంబర్ 1235 ప్రకారం 2 ఎకరాల స్మశాన వాటిక కు స్థలం కేటాయించాలని కెవిపిఎస్ సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు లక్ష్మణ్,వెంకటలింగం,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎమ్మార్ నాయక్, ప్రజానాట్యమండలి నాయకులు బాల ఉసేని, సుధాకర్,19వ వార్డు ప్రజలు వీరసేన,బంగారయ్య, గుండయ్య, దేవకుమార్,శ్యామ్ సుందరరావు, సుదర్శన్, సుధాకర్, రామకృష్ణ లు పాల్గొని అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులు కి సమస్య లతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని కేవలం మాటల గారడితో దళితులను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ప్రగల్బాలను పలకడం తప్ప ఏమాత్రం దళితుల అభివృద్ధికి కృషి చేయడం లేదని అన్నారు.ముఖ్యంగా నంద్యాల పట్టణంలోని 19వ వార్డు పొన్నాపురం, పొన్నాపురం కాలనీలో దళితులు నివసిస్తున్న కాలనీలలో నేటి వరకు రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేకపోవడం చాలా దుర్మార్గమని, అదేవిధంగా ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ చనిపోయిన చోట కూడా ప్రశాంతంగా పూర్తి పెట్టేందుకు ఆరు అడుగుల స్థలం కూడా లేకపోవడం చాలా దురదృష్టకరమని ముఖ్యంగా ఈ వార్డులో నివసిస్తున్నా దాదాపు 7వేల మంది ప్రజలకు కేవలం నాలుగు సెంట్లలో స్మశాన వాటిక ఉందంటే ఏ విధంగా ఎక్కడ పూడ్చి పెట్టాలో అర్థం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో పూడ్చిపెట్టిన శవాలు ప్రక్కనే ఉన్న కాలువలలో కొట్టుకొని పోతున్నాయని ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే జీవో నెంబర్ 1235 ప్రకారం దళితులకు స్మశాన వాటిక కోసం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని లేనిపక్షంలో దళితులను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తహసీల్దార్ శ్రీనివాసులు వివరణ :- గతంలో ఉన్న స్మశాన వాటిక స్థలానికి సంబంధించి రికార్డులను వెరిఫై చేసి సర్వేలను పంపించి అక్కడ ఎంత స్థలం ఉందో తెలుసుకొని అవసరమైతే దళితుల కోసం రెండు ఎకరాలు కేటాయించేందుకు కూడా ప్రయత్నం చేస్తామని అన్నారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి బ్యూరో చీఫ్ జూలై 18 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద్ర లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇందిర ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో మూడవ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ (ఎఫ్.ఏ.సి), నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై బల్క్ వెస్ట్ జనరేటర్ ను ప్రారంభించారు. ఒక టన్ను వెస్ట్ ను 24 గంటల్లో కంపోస్ట్ గా బల్క్ వెస్ట్ జనరేటర్ మారుస్తుందని అధికారులు ఎమ్మెల్యే కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని తెలిపారు. ప్రజలు తమ ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుతారో అలాగే వీధిని, నగరాన్ని ఉంచడంలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికైన స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద్ర ను విజయవంతం మన అందరి బాధ్యత అని చెప్పారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు పరిశుభ్రతలో తిరుపతి ఆదర్శ నగరమన్న భావన కలిగే విధంగా నిలపాలని విజ్ఞప్తి చేశారు. బల్క్ వెస్ట్ జనరేటర్ లను వ్యాపారస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములై స్వచ్ఛ తిరుపతి స్థాపనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్,



రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, డి.ఈ.లు రమణ, రాజు, మేనేజర్ హాసీమ్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రధమ చికిత్స, సి పి ఆర్ లైఫ్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్ పైన అవగాహన కార్యక్రమము



**నంద్యాల ప్రతినిధి. జూలై 18 . (నంది పత్రిక ):** నంద్యాల జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు సెట్కూర్ సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాల పట్టణ శివారులోని ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల నందు ప్రధమ చికిత్స, సి పి ఆర్, లైఫ్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెట్కూర్ జిల్లా సీఈవో డాక్టర్ వేణుగోపాల్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా సెక్రెటరీ శ్రీకాంత్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ అరుణకుమారి, జిల్లా ఎంప్లాయిమెంట్ మరియు స్కిల్ అధికారి సోమశివారెడ్డి, రెడ్ క్రాస్ డి ఎఫ్ ఓ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ ప్రభుత్వం ఆధ్వర్యంలో యువతకు నైపుణ్యాల పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పై లింకు ద్వారా జాయిన్ కావాలని, శిక్షణ పొంది తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని తెలియజేశారు.రెడ్ క్రాస్ కోశాధికారి డాక్టర్ అరుణ కుమారి ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ లైఫ్ సేవింగ్ స్కిల్స్ గురించి విద్యార్థులకు మంకిన్ డివైస్ ద్వారా వివరించారు.రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల మాట్లాడుతూ ఎస్వీఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులు రెడ్ క్రాస్ పోస్టర్లో పొందుపరిచిన క్యూఆర్ కోడ్ ద్వారా లేదా 8985770583, 9347922901 వాట్సాప్ నంబర్లను సంప్రదించడం ద్వారా, అలాగే యతీషఎతీష.ఱతీఽంఅసశ్రీఏస్త్రఘఱశ్రీ.ఽశీఎ ఈ-మెయిల్ ఐడీ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకుని రెడ్ క్రాస్ వాలంటీర్లుగా చేరాలని, రెడ్ క్రాస్ వాలంటీర్లుగా చేరిన వారికి డిజాస్టర్ రిలీఫ్, ఫస్ట్ ఎయిడ్ ఆరోగ్య సేవలు, రక్తదానం, పర్యావరణ పరిరక్షణ పరిశుభ్రత సమాజసేవకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



## 125 రోజుల ఉపాధి పనులు వెంటనే కల్పించాలి: వ్యవసాయ కార్మిక సంఘం

### ఎంపీడీవో వినతిపత్రం.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



**వెలుగోడు, జూలై 18 (నంది పత్రిక):** గ్రామీణ శ్రామికులకు నూతన చట్టం ప్రకారం వెంటనే 125 రోజుల ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం వెలుగోడు ఎంపీడీవో ఆఫీస్ నందు డిప్యూటీ ఎంపీడీవో గంధం మురారికి వినతిపత్రం సమర్పించారు. నూరుల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నరసింహ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై 2 నుంచి గ్రామీణ కూలీకి 125 రోజుల ఉపాధి కల్పిస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు జిల్లాలో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించకపోవడం విచారకరమని.జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు లేక గ్రామీణ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రకరకాల కారణాలతో కాలయాపన చేయడం సరికాదన్నారు.వెలుగోడు గ్రామంలో జాబ్ కార్డులు కలిగిన ప్రతి కూలీకి, పని కోరిన ప్రతి గ్రూపునకు వెంటనే ఉపాధి పనులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇకపై కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గ్రామంలోని శ్రామికులందరినీ సమీకరించి ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు కృష్ణ, మీరా హుస్సేన్, భాషా ఇతరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామీణ కూలీలు ఉన్నారు.

## ప్రీమియం చెల్లించి పంటల బీమా చేసుకోండి

**బండి ఆత్మగూరు నంది పత్రిక జూలై 18 :** బండి ఆత్మకూరు గ్రామంలో సాగుచేసిన సోయా చిక్కుడు పంటను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు.. ముఖ్యంగా ఈ ఖరీఫ్ సీజన్లో రాబోతున్న ప్రకృతి విపత్తు ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు వలన మొక్క వడిలిపోయినట్టు ఉన్నపుడు మల్టీ కె కానీ నానో యూరియా కానీ స్ప్రే చేసుకోవడం వలన పంట బెట్టను తట్టుకొని ఉంటుంది అని తెలిపారు. వేడి వాతావరణం ఉన్నపుడు రసం పీల్చే పురుగులు వలన నష్టం వస్తుందని, దానికిగాను అసెఫేట్ 3 జిమ్ ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ లో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల బీమా ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేసుకోవాలని రైతులను కోరారు. పంట రుణాలు పొందిన రైతులు నేరుగా బ్యాంక్ సంప్రదించి పంట బీమా ప్రీమియం చెల్లించాలని, ఇతరులు మీసేవ వద్ద ప్రీమియం చెల్లించి పంట బీమా చేసుకోవాలని తెలిపారు. రైతులు మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవ కేంద్రా సిబ్బందిని లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని తెలిపారు.



# మోడీ చంద్రబాబు ప్రజలకు చేసింది ఏమీ లేదు

# ప్రజలను మోసం చేయడం తప్ప






### ప్రశ్నపత్రాల లీకేజీ తో విద్యార్థుల జీవితాలతో చెలగాటం

### అయోధ్య రామ మందిరం కుంభకోణంపై నోరు మెదపరు ఎందుకు?

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**బద్వేల్ జులై 18నంది పత్రిక : :** బద్వేల్ పట్టణంలో జరుగుతున్న సిపిఐ కడప జిల్లా సమితి రాజకీయ శిక్షణ సైదాంతిక శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విలేకరులతో మాట్లాడుతూ ఈరోజు కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి ఎన్డీఏ ప్రభుత్వం నియంతృత్వంగా, నిరంకుశంగా ప్రజాస్వామిక హక్కులను కాలరాచి వేస్తూ తన యొక్క పరిపాలన విధానాన్ని కొనసాగిస్తా ఉంది. అందులో భాగంగానే ఈ దేశంలో ఎన్డీఏ గవర్నమెంట్ అధికారంలోకి వచ్చినటువంటి ఈ పన్నెండు సంవత్సరాల కాలంలో దాదాపు దేశవ్యాపితంగా ఎనభై తొమ్మిది పరీక్షలు లీకేజీ అయినటువంటివి. అది టెన్త్ క్లాస్ సిబిఎస్ఈ దగ్గరి నుండి టెట్ పరీక్ష దగ్గరి నుండి నీట్ పరీక్ష వరకు లీకేజీ అయినటువంటి అంశం దేశమంతా గమనిస్తున్నారు. కాబట్టి ఈ నేపథ్యంలో విద్యారంగంలో మార్పులు తీసుకుని రావాలి, దానికి బాధ్యత వహించేటటువంటి పద్ధతుల్లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పి డిమాండ్ చేస్తూ అదే విధంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని చెప్పి డిమాండ్ చేస్తూ గత ఇరవై రోజుల కాలంగా సోనం వాంగ్చుక్ పెద్ద ఎత్తున ఆమరణ నిరాహార దీక్ష చేస్తా ఉన్నాడు. ఆ నిరాహార దీక్షను కూడా భగ్నం చేయడం జరిగింది. భగ్నం చేసినంత మాత్రాన విద్యార్థుల్లో దేశ ప్రజల్లో నెలకొన్నటువంటి భావన ఏదైతే ఉందో దాన్ని భగ్నం చేయడం సాధ్యం కాదు. కాబట్టి నరేంద్ర మోడీ మౌనవత వదిలి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరాలని చెప్పేసి మేము భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా డిమాండ్ చేస్తా ఉన్నాం. నరేంద్ర మోడీ గారు తనకు తానుగా విశ్వగురువుగా ప్రకటించుకున్నటువంటిది. ఆయన్ని విశ్వగురువుగా ప్రచారం చేస్తున్నటువంటి వ్యక్తులు శక్తులకు ఈరోజు కమ్యూనిస్టు పార్టీగా మేము అడుగుతా ఉన్నాం. చాలా గొప్ప పరిపాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చినటువంటి ఎన్డీఏ ప్రభుత్వం దేవుడి పేరు చెప్పి రాముడి పేరు చెప్పి ఎంత పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతా ఉన్నారో ఈరోజు దేశమంతా కూడా గమనించినటువంటిది, వీక్షిస్తున్నటువంటి అంశం అందరి కళ్ల ముందు కనిపిస్తా ఉంది. కానీ రామాలయంలో ఉన్నటువంటి అయోధ్య రామాలయంలో ఉన్నటువంటి గర్భగుడిలో ఉన్నటువంటి దాదాపు రెండు వందల కోట్ల పైచిలుకు డబ్బులు, నగలు, అదేవిధంగా ఇతరతర వస్తువులు నలభై రోజుల్లో డెబ్బై సార్లు దొంగతనం చేస్తే మరి దానిపైన దేశమంతా కూడా ఆందోళన చెందుతా ఉంటే నరేంద్ర మోడీ లేదా అక్కడ ఉన్నటువంటి అమిత్ షా , లేదో ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి యోగి ఆదిత్యనాథ్ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఈ దేశ దౌర్భాగ్యంగా భావిస్తా ఉన్నాం. అందుకనే రేపు జరిగేటువంటి పార్లమెంటరీ సమావేశాల్లో దీనిపైన చర్చకు తీసుకుని రావాలి, నిజంగా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశాన్ని ఒకటి ఏర్పాటు చేసి జెపిసిని వేయాలని చెప్పేసి మేము సిపిఐగా డిమాండ్ చేస్తున్నాం. రామాలయంలో దొంగతనం జరిగింది, దేవుడి పేరు చెప్పి దొంగతనం చేస్తున్నారు వీరని చెప్పి ఒకవైపున దేశ ప్రజలంతా కూడా ప్రశ్నిస్తా ఉంటే ఇక్కడ దేశంలో ఉన్నటువంటి కొంతమంది అంధ భక్తులంతా కలిసి ఇది ఏం ఎవరి సొమ్మైనానా? ఇది హిందువుల సొమ్ము కాబట్టి హిందువులు దోపిడీ చేశారని చెప్పేసి వారు ప్రకటిస్తున్నారు. అంటే హిందువుల సొమ్మయితే మాత్రం లైసెన్సులు ఏమైనా మంజూరు చేశారా? మరి దొంగతనానికి నరేంద్ర మోడీ, అమిత్ షా , యోగి ఆదిత్యనాథ్ ఈ దేశంలో కాపలా కాస్తున్నారని చెప్పి మేము ఈ సందర్భంగా అడుగుతా ఉన్నాం. కాబట్టి దీనిపైన జెపిసి కచ్చితంగా వేయాల్సిందే. అదేవిధంగా దానికి సంబంధించిన ట్రస్టులో జరుగుతున్నటువంటి అక్రమాలన్నింటినీ కూడా వెలికి తీయాలని చెప్పేసి మేము దీన్ని కోరుతా ఉన్నాం. దీనిపైన ఎవరైనా ప్రశ్నిస్తే ఈ దేశంలో ఈరోజు హైదరాబాద్లో విజయ విహారం వెలిటరు రమణమూర్తి ఒక టీవీ ఛానల్ డిస్కషన్లో కూర్చొని దానిపైన ప్రశ్నిస్తే దాడి చేస్తా ఉన్నారు. భౌతిక దాడులకు పూనుకుంటున్నారు. మరి మే 18వ తారీఖు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్కు వచ్చినటువంటి సందర్భంలో పత్రికల్లో ఇచ్చినటువంటి అడ్వర్టైజ్మెంట్స్లో అందరు దేవతలు చుట్టూ ఉండి, మధ్యలో శ్రీకృష్ణుడు ఉంటే ఆ శ్రీకృష్ణుడి తలకాయను పైకి లేపి అందులో నరేంద్ర మోడీ ఫోటో పెట్టి పబ్లిక్ చేసినటువంటిది వాస్తవం కాదా అని చెప్పి అడుగుతా ఉన్నాం. అంటే దేవుడి కంటే కూడా నరేంద్ర మోడీ చాలా గొప్పవాడని చెప్పి చెప్పుకోడానికి మీరు ప్రయత్నం చేయొచ్చు. మీరు హిందూ ధర్మాన్ని తుంగలో తొక్కొచ్చు, మీ యొక్క తప్పులను ఎవరైనా ప్రశ్నిస్తే భౌతిక దాడులకు పూనుకోవడం ఇంతకంటే దుర్మార్గమైనటువంటి చర్య మరొకటి లేదని చెప్పి ఈ సందర్భంగా మేము తెలియజేస్తా ఉన్నాం. కాబట్టి ఇది ఒక్కటే కాదు దేశవ్యాపితంగా కూడా నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన అదానీలను, అంబానీలను పోగొట్టడానికే ప్రధానమైనటువంటి కార్యచరణ తీసుకున్నారు తప్ప వేరొకటి ఏ ఒక్క అంశంలో కూడా ఈరోజు రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రోజుకు ముప్పై ఒక్క మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆత్మహత్యల నివారణ కోసం ఏం చర్యలు తీసుకున్నారు? ఏ ఒక్కటి చర్యలు తీసుకున్నటువంటి పాపాన పోలేదు. ఈ పన్నెండు సంవత్సరాల కాలంలో దాదాపు ఒక్క లక్షా నలభై రెండు వేల మంది పైచిలుకు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. రైతులకు ఎంఎస్పీ ఇవ్వాలని చెప్పేసి గిట్టుబాటు ధర ఇవ్వాలని చెప్పేసి ఒక వైపున డిమాండ్ చేస్తూ ఉంటే దాని గురించి మాట్లాడడం లేదు. ఇంకొక వైపున కార్మిక వర్గాన్ని వీధులు పాలు చేసేటటువంటి చర్యలకు పూనుకుంటా ఉన్నారు. ఇన్ని రకాలుగా ఈ ప్రభుత్వం వైఫల్యం చెంది దేశాన్ని ఎక్కడికో మేము తీసుకుని పోతున్నామని చెప్పి ప్రకటిస్తున్నారు. ఎక్కడికి తీసుకుని పోతున్నారు? ఈ దేశాన్ని అప్పుల కుప్పగా మార్చి అమెరికా విధించినటువంటి విదేశంగ విధానానికి తలవొగ్గి ఈ దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికాకు తాకట్టు పెట్టేటటువంటి కార్యక్రమానికి నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. మళ్లా మమ్మల్ని మించినటువంటి దేశభక్తులు ఎవరూ లేరని చెప్పి ప్రచారం చేస్తున్నారు. మీరు అమెరికాకు ఈ దేశ సార్వభౌమాధికారాన్ని వారికి తాకట్టు పెట్టి అమెరికా ట్రంప్ ఏం చెబితే దాన్ని మీరు అంగీకరిస్తూ ఇంకొక వైపున మేము ఈ దేశానికి దేశభక్తులం, భారతీయులం, జాతీయత అని చెబితే ఈ జనం నమ్మడానికి సిద్ధంగా లేరని చెప్పి మేము ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. ఇంకా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు యొక్క పరిపాలన క్రమాన్ని ఈ రెండు సంవత్సరాల కాలంలో గమనిస్తున్నాం. సిక్స్ పాయింట్ ఫార్ములా అని చెప్పారు. అన్ని రకాల మొత్తం అన్ని అమ్మేసినామని చెప్పి చెప్పాడు. మహిళలకు పదిహేను వందలు, పదిహేను వందలు ఇస్తామని చెప్పాడు. ఇచ్చారా? రెండు సంవత్సరాలు అయ్యింది. ఇవ్వలేదు. పైగా ఐదు లక్షల మందికి, సంవత్సరానికి నాలుగు లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామన్నాడు. ఆ ఉద్యోగాలు కూడా ఇచ్చినటువంటి పాపాన పోలేదు. నోటిఫికేషన్లు ఏ ఒక్కటి రానటువంటి పరిస్థితి. ఉద్యోగాల కల్పన లేదు, మహిళలకు చెప్పిన వాగ్దానం నెరవేరలేదు. పైగా ఈరోజు శ్రీశక్తి పథకాన్ని మేము చాలా గొప్పగా ఇంప్లిమెంట్ చేస్తున్నామని చెప్పాడు. శ్రీశక్తి పథకాన్ని ఇంప్లిమెంట్ చేయాలంటే అది ఆర్టీసీ ప్రభుత్వ ఏలుబడిలో ఉండాలి. కానీ ఈరోజు మెగా కృష్ణారెడ్డి లాంటి వాళ్లకు ఆర్టీసీని అప్పగించడానికి మూడు వేల ఐదు వందల బస్సులు ఉంటే 2037 నాటికి మొత్తం ఎలక్ట్రికల్ బస్సులు తయారు చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే మరి ఏ పద్ధతిలో శ్రీశక్తి పథకం అమలు అవుతుంది? కొత్త బస్సులు కావాలి రాష్ట్రంలో దాదాపు ఒక్కొక్క బస్సు పన్నెండు లక్షల, పదమూడు లక్షల కిలోమీటర్లు తిరిగి డొక్కు బస్సులు తయారైనాయని చెప్పి ఒక వైపున ఎంప్లాయిస్ని ఆర్టీసీ కార్మిక వర్గం ప్రకటిస్తా ఉంటే దానికి జవాబు చెప్పినటువంటి పరిస్థితి మరొక వైపున ఏమాత్రం కూడా లేనటువంటిది. పైగా ఈరోజు భూమి ఇష్టానుసారంగా పందేరం చేస్తా ఉన్నాడు. ఇప్పుడు రాజధానిలో లక్ష ఎకరాల భూ సమీకరణ అని చెప్పినారు. ఇప్పటికే యాభై ఆరు వేల ఎకరాలు మొదటి దశలో తీసుకున్నారు. మళ్లీ పదహారు వేల ఎకరాలు తీసుకున్నారు. అది సరిపోలేదని చెప్పేసి రెండో దశలో మళ్లీ భూ సమీకరణ పేరుతో మొత్తం ఒక లక్ష ఎకరాలు భూ సమీకరణ కోసం ప్రయత్నం చేస్తారు. రైతులు ఇవ్వమని చెప్పి చెబితే దాని పైన బుల్డోజర్లను ప్రయోగం చేసేటటువంటి కార్యక్రమానికి చంద్రబాబునాయుడు గారు శ్రీకారం చుట్టారు. కాబట్టి ఇట్లా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ఏమో కార్పొరేట్లకు పనికొచ్చేటువంటి విధానాలను కార్పొరేట్ కంపెనీల యొక్క ప్రయోజనాలను కాపాడేటటువంటి బదులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వ రంగ ఆస్తులను తెగనమ్మేటువంటి కార్యక్రమానికి ఆయన వైపున శ్రీకారం చుట్టినటువంటిది కళ్ల ముందు కనిపిస్తుంది. దీని పైన యూట్యూబర్స్ గాని, పత్రికా విలేకరులు గాని లేదా ప్రతిపక్ష పార్టీలు గాని లేదా పాలక పార్టీ విధానాలు నచ్చలేదని ఎవరైనా ప్రశ్నిస్తే వాళ్ల పైన ఊపా చట్టాలను ప్రయోగించడానికి కూడా వెనుకాడటం లేదు. ప్రశ్నా రావనటువంటి వ్యక్తి మాట్లాడినాడు. తప్పు ఉంది, శిక్షించాలి, జైలు పెట్టాలి లేదా కేసులు పెట్టాలి, కానీ నాలుగు కేసుల్లో ఆయనకు బెయిల్ వస్తే నాలుగు కేసుల్లో బెయిల్ వచ్చిన తర్వాత ఫ్రస్ట్రేషన్కు లోనై గవర్నమెంట్ ఊపా కేసు పెట్టడం అన్నటువంటిది అంటే దేశద్రోహ కేసు, అదేవిధంగా టెర్రరిస్టులకు మద్దతు ఇచ్చారు అనేటువంటి దానికి సంబంధించి ఈ దేశంలో విచ్ఛిన్నకర శక్తులను రమ్మని చెప్పి ఆహ్వానించారని చెప్పి అలాంటి సెక్షన్లు ఇక్కడ పెట్టి ఆయనను బంధించాల్సినటువంటి అవసరం ఏముంది? పైగా ఆ కేసు వెలుగులో ఇప్పుడు చంద్రబాబునాయుడు పరిపాలన విధానంలో విపరీతమైనటువంటి మార్పులు తీసుకుని వస్తున్నాను అని చెప్పి నిన్న మంత్రివర్గ సమావేశంలో ఎవరైనా ప్రభుత్వం పైన అవాకులు చవాకులు పేల్తే వారందరినీ లోపల వేస్తామని చెప్పేసి యూట్యూబర్స్ కి అందరికీ కూడా ఈరోజు నోటీసులు సర్వ్ చేస్తామని చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తా ఉన్నారు. అంటే ఈ రాష్ట్రంలో అన్యాయం జరుగుతా ఉందంటే ప్రజల పక్షాన మాట్లాడడానికి యూట్యూబర్స్ కు హక్కులు లేవా? అంటే పత్రికలను, మీడియాను మేనేజ్ చేసినంత మాత్రాన ఇతరతర వ్యక్తుల యొక్క గొంతులను నొక్కడానికి కావలసినటువంటి ప్రయత్నం ఇది సరైనటువంటిది కాదని చెప్పి చంద్రబాబునాయుడు కి మేము ఈ సందర్భంగా తెలియజేస్తా ఉన్నాం. కాబట్టి ఇలాంటి చర్యలు మానుకోవాలి. చంద్రబాబునాయుడు కి సిపిఐ గా మేము ఒక హెచ్చరిక పలుకుతా ఉన్నాం. మీరు పవన్ కళ్యాణ్ గారు అడిగినప్పుడల్లా ఆయనకు పప్పులు పెట్టి పోరు మారవాలని చెప్పేసి ఆయన విమర్శించినటువంటి వాళ్ళందరి పైన మీరు కేసులు పెట్టుకుంటూ పోతే పవన్ కళ్యాణ్ తో పాటు మీరు కూడా పోతారు. పవన్ కళ్యాణ్ పక్కాగా బిజెపి అజెండాను ఇంప్లిమెంట్ చేయడానికి కావలసినటువంటి నిరంతరమైనటువంటి ప్రయత్నం చేస్తున్నారు. మీరన్నా మేలుకోండి బాబు మీ పార్టీ గతంలో లౌకిక పార్టీగా ఉందని ఒక పేరు ఉన్నది. ఆ పేరు ఇప్పుడు క్రమక్రమంగా పోయేటువంటి పరిస్థితి వస్తా ఉంది. మీరు రాజధానిలో నిన్న మొన్న మీరు ఒక మాట ప్రకటించారు ఈ రాజధాని అనేటువంటిది హిందూ ధర్మ పరిరక్షణ కోసం అని చెప్పారు అంటే ఇక్కడ ఓన్లీ కేవలం హిందువులకు మాత్రమే రాజధాని నిర్మాణం చేస్తారు ముస్లింలు అవసరం లేదా, క్రిస్టియన్లు అవసరం లేదా, బౌద్ధులు అవసరం లేదా, ఏ మతాన్ని స్వీకరించినటువంటి హేతువాదులు అవసరం లేదా? వాళ్లందరికీ ఇది రాజధాని కాదా, ఎలా మాట్లాడతారండి? 45 సంవత్సరాల మోస్ట్ ఎక్స్పీరియన్స్ ఉన్నటువంటి ఒక సీనియర్ పొలిటిషియన్ గా ఈ దేశంలో గుర్తింపు పొందినటువంటి ఒక ముఖ్యమంత్రిగా ఇలాంటి మాటలు మీరు మాట్లాడితే మరి మీరు బిజెపినైజేషన్ పాలిటిక్స్ అని చెప్పేసి బిజెపి ఏమైతే అమరల చేస్తా ఉందో వాటిని ఈ రాష్ట్రంలో ఇంప్లిమెంట్ చేయడానికి మేము పని చేస్తున్నాం అని చెప్పి ప్రకటించాలని తెలియజేశారు ప్రభుత్వాలు ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సూచించారు బాధ్యతాయుతమైన పాలన అందించాలని. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామయ్య, వీరశేఖర్, వెంకట శివ, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, శ్రీరాములు, బాల ఓబయ్య, పిడుగు మస్తాన్, వెంకట రాములు, శంకర్ నాయక్ ఏరియా సహాయ కార్యదర్శులు పీవీ రమణ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా 'స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం

### పారిశుధ్యమే ఆరోగ్యానికి పునాది.. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసిన అధికారులు, ప్రజలు

**వెలుగోడు, జూలై 18 (నంది పత్రిక):** పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం శనివారం వెలుగోడులోనీ స్థానిక తెలుగు గంగ అతిథి గృహం వద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. "పరిశుభ్రమైన గ్రామం



ఆరోగ్యకరమైన జీవనం", "స్వచ్ఛతే సేవ" వంటి నినాదాలతో, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలతో కలిసి 'స్వచ్ఛ ఆంధ్ర' ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచేందుకు, పారిశుధ్య నియమాలను పాటిస్తూ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ రెడ్డి , డిప్యూటీ ఎంపీడీవో గంధం మురారి , చాంద్, క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, గ్రామ ప్రత్యేక అధికారి స్వాతి మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం స్వచ్ఛతను జీవనంగా మార్చుకోవాలని, గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలుగోడు సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



# గృహాల మంజూరు ఎన్నడు

**-ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు ఎప్పుడు ఇస్తారు.**

**-సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించిన జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి**



**కొత్తపల్లి – నంది పత్రిక:** మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనం నందు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సమావేశం నందు అన్ని శాఖల అధికారులతో వారి పరిధిలోని మూడు నెలల వ్యవధి కాలంలో జరిగిన అభివృద్ధి పనులు, పలు పథకాల అమలు నివేధికలు సభలో ఎంపీడీఓ మేరి చదివింపజేశారు. ఆనంతరం ఎంపీటీసీల పదవి కాలం ముగుస్తుండడంతో వారిని దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మాన కార్యక్రమాలు చేశారు. ఆదేవిధంగా ఎంపీడీఓ ఇతర అధికారులను ఎంపీటీసీలు దుశ్శాలువలు పూలమాలలతో సన్మానించారు. అంతకు మునుపు జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాకా ఎంతో మంది పేదప్రజలకు పక్కా గృహలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటిదాకా గృహల మంజూరును మరిచిందన్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ గృహాల పేరిట లబ్దిదారుల ఖాతాల్లో ఒక్క రూపాయ వేశారు తప్పా ఇప్పటిదాకా మిగిలిన బిల్లులను చెల్లించకపోవడం సిగ్గుచేటు అన్నారు. అదేవిధంగా ఎస్టీలు గృహనిర్మాణాలు చేసుకుంటే ఆదనంగా రూ.1,00,000 లు ప్రభుత్వం ఇస్తామని చెప్పి మాటతప్పడం బాధాకరమన్నారు. ఖరీఫ్ సీజన్లో అరకొరగా సాగుచేసిన పంటలకోసం రైతులకు ఎరువులను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమయిందని ధ్వజమెత్తారు. సోసైటీల ద్వారా పచ్చతమ్ముల్లకు మాత్రమే ఎరువులు ఇచ్చారు తప్పా నిజమైన రైతులకు ఎరువులు అందించలేదని ఆవేధన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ డీప్యూటీ డైరెక్టర్ శివారెడ్డి, డీప్యూటీ తహసీల్దార్ ఆరుణ, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), కో–ఆప్షేడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# పంటలకు ఊపిరి పోసిన వర్షం.

**సంతోషం వ్యక్తం చేస్తున్న రైతన్న.**



**రుద్రవరం ప్రతినిధి జులై 18 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలోని పలు గ్రామాలలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన పంటలకు ఊపిరి పోసింది. ఇప్పటికే రైతులు బోరుబావుల కింద మిరప, మొక్కజొన్న, మినుము సాగు చేశారు. అయితే దాదాపు నెల రోజుల నుంచి వర్షాలు కురవకపోవడంతో సాగుచేసిన పంటలు ఎండు ముఖం పట్టాయి. పేరూరు ,చిలకలూరు ఎర్రగుడిదిన్నె, చందలూరు, మందలూరు, తదితర గ్రామాలలో దాదాపు 100 ఎకరాలలో మినుము ఎండిపోయే పరిస్థితుల్లో ఉండగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కు పంటలకు ఊపిరి పోసింది. 49,2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో రైతులు పీల్చుకున్నారు.



# అమరావతి ఛాంపియన్‌షిప్‌ల సెలక్షన్స్‌కు విస్తృత ప్రచారం

**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలి: స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా**



**వెలుగోడు, జూలై 18 (నంది పత్రిక):** శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు జూలై 25న ఆత్మకూరు ఎన్టీఆర్ కెవికె స్టేడియంలో నిర్వహించనున్న అమరావతి ప్రతిష్టాత్మక నియోజకవర్గ స్థాయి ఛాంపియన్‌షిప్ క్రీడల సెలక్షన్స్ నేపథ్యంలో వెలుగోడు పట్టణంలో శనివారం విస్తృత ప్రచార కార్యక్రమం. ఈ సందర్భంగా వెలుగోడు మండల విద్యాశాఖాధికారి బ్రహ్మం నాయక్ , మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని , స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలిక్ ఖాన్ తో కలిసి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులకు క్రీడా పోటీల ఆహ్వాన పత్రికలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడల సెలక్షన్స్ మంచి వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రోత్సహించాలని సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థులకు ఉన్నత స్థాయిలో ప్రతిభ చాటుకునే అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు మండల అధ్యక్షులు అబ్దుల్ కలాం , క్లస్టర్ ఇన్‌చార్జి ఖలీలుల్లా ఖాన్ , ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పాస్పిల్ మున్నా , క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడా విభాగ సభ్యులు ఉన్నారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షం ను మర్యాదపూర్వకంగా కలిసిన కాన్కర్ ఒకేషనల్ కాలేజ్ అధినేత వేణుగోపాల్.



**నంది పత్రిక:ఆత్మకూరు.** నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షం ను కర్నూలు కాంకర్ ఒకేషనల్ కాలేజ్ అధినేత వేణుగోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణానికి పొలం తగాదా విషయం పరిష్కారం కోసం రావడం జరిగిందన్నారు. ఈ పొలం తగాదా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ కులాల అభ్యున్నతికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. దళితుల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ శీలం శేషు, వార్త న్యూస్ ఎడిటర్ వనమాల పుల్లయ్య, ముసలమడుగు బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# మాకు పనులు కల్పించండీ



**కొత్తపల్లి – నంది పత్రిక :** వీబీజీ రాంజీ పథకం ద్వారా పనులు కల్పించాలని శ్రామికులు విజయమ్మ, లలితమ్మ, జయమ్మలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వీబీజీ రాంజీ కార్యాలయం వద్ద కొత్తపల్లి శ్రామికులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇతరకులాలకు పది వారాలు వీబీజీ రాంజీ పనులు కల్పిస్తే ఎస్సీలకు మాత్రం నాలుగు వారాలు మాత్రమే పనులు కల్పిస్తున్నారన్నారు. మాకు పనులు కల్పించాలని అధికారులను అడిగేందుకు వస్తే పనులు లేవు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని దురుసు సమాదానం ఇస్తున్నారని శ్రామికులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు వారాలనుంచి పనులు కల్పించడం లేదని పనులు కల్పించకపోతే నంద్యాల కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రామికులు ఎస్తేరు, శ్రావణి, మరియమ్మ, లక్ష్మమ్మ, జి. లలితమ్మ, రత్నకుమారి, సువార్తమ్మ, శాంతమ్మ, జీవమ్మ, జి. మరియమ్మ, నాగమ్మ, పి. నాగమ్మ, పద్మావతి, రవణమ్మ, మేరిలు ఉన్నారు.

# నంద్యాల నియోజకవర్గంలో.. ప్రతిష్టాత్మకంగా 'జగన్ 2.0' సూపర్ యాప్ ఆవిష్కరణ! ...వైసీపీ

**నంద్యాల సిటీ బ్యూరో జులై 18 ( నంది పత్రిక )** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాఅభిప్రాయాలకు, సమస్యల పరిష్కారానికి, ప్రజల గొంతుకగా సరికొత్తగా 'జగన్ 2.0' సూపర్ యాప్ను లాంచ్ చేసి విప్లవానికి నాంది పలికింది . వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'జగన్ 2.0 సూపర్ యాప్'ను నేడు నంద్యాల నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ఆధ్వర్యంలో మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి,నంద్యాల అసెంబ్లీ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, స్టేట్ సిఇసి మెంబర్స్ దేశం సుధాకర్ రెడ్డి, రామలింగారెడ్డి, స్టేట్ మహిళా విభాగం సెక్రటరీ శశి కళ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, ముఖ్య నేతలు జగనన్న 2.0 సూపర్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, ముఖ్య నేతలు మాట్లాడుతూ...వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరిని ఒకే తాటిపైకి తెచ్చేందుకు, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో, ముఖ్య నేతలతో నేరుగా అనుసంధానం చేసేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు క్షేత్రస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకత్వం వరకు అందరూ ఒకే డిజిటల్ వేదికపైకి వచ్చేలా ఈ యాప్‌ను అత్యంత అధునాతన సాంకేతికతతో రూపొందించారని తెలిపారు. ప్రధానంగా కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రాజకీయ వేధింపులపై నేరుగా పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు ఇందులో 'డిజిటల్ డైరీ' సదుపాయాన్ని కల్పించారని వెల్లడించారు. పార్టీ అధికారిక ప్రకటనలు, ప్రెస్ మీట్లు, పర్యటనలు, లైవ్ అప్‌డేట్స్ అన్నీ ఈ యాప్ ద్వారా ప్రతి ఒక్కరికీ తక్షణమే అందుబాటులోకి వస్తాయని నేతలు వివరించారు. వైసీపీ అఫిషియల్ ఫేస్ బుక్, ఇంస్టా గ్రాం అక్కౌంట్స్ కూటమి నేతలు బ్లాక్ చేయించారని పేర్కొన్నారు. లక్షలాది సబ్ స్క్రైబర్లను కోల్పోవల్సివచ్చిందన్నారు. సోషల్ మీడియాలో పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు, వైఎస్సార్సీపీ డిజిటల్ సైనికులుగా మారేందుకు ఈ యాప్ ఒక అద్భుతమైన ఆయుధమని శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ప్రతి ఒక్కరూ గూగుల్ ప్లే స్టోర్ నుండి 'జగన్ 2.0' యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకుని, సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ నాయకులు పిలుపునిచ్చారు., కార్యక్రమంలో జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, జిల్లా వైసీపీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, జిల్లా వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడురసూల్ ఆజాద్, జిల్లా వైసీపీ మున్సిపల్ అధ్యక్షుడు టైలర్ శివ,జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అమృతరాజ్, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టివి రమణ, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్,వైసీపీ జిల్లా సెక్రెటరీ దేవనగర్ బాషా, గన్ని కరీం, వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి,నంద్యాల అసెంబ్లీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు మనోజ్, నంద్యాల అసెంబ్లీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రామచంద్రుడు, మాజీ కౌన్సిలర్స్ ఆరిఫ్ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, కలాం భాష, షాదిక్ భాష, మెస చంద్రశేఖర్, చింత శ్రీనివాసులు, సుబ్బారాయుడు, వైసిపి నాయకులు సాయిరాం రెడ్డి, శ్రీరాములు, భాస్కర్ రెడ్డి, రహంతుల్లా, కాలువ నాగరాజు, పైలెట్, రమేష్, ఎర్రన్న, మగ్గం రఫీ, బ్రహ్మయ్య,తిమ్మరాజు,తదితరులు పాల్గొన్నారు



# షైనింగ్ స్టార్ అవార్డుకు 6 మంది విద్యార్థులు ఎంపిక



**మద్రిపాడు జులై 18నంది పత్రిక :** పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జిల్లాస్థాయి షైనింగ్ స్టార్ అవార్డులకు మద్రిపాడు మండలం నుంచి 6 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య,ధనలక్ష్మి తెలియజేశారు. నందవరం మోడల్ స్కూలుకు చెందిన పెసల గోవర్ధన్, గాలం వసుధ,రాగి వాణి,నందవరం ఉన్నత పాఠశాలకు చెందిన మద్దిరెడ్డి వైష్ణవి,కస్తూర్బా గాంధీ విద్యాలయానికి చెందిన తెలజాల మస్తానమ్మ, చిలకపాడు ఉన్నత పాఠశాల చెందిన మిట్టమాల బేబీ హర్షిత ఈ అవార్డుకి ఎంపికై ఈనెల 20వ తేదీ సోమవారం నెల్లూరు లోని కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో జిల్లా అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్,మెమెంటో మరియు ఇరవై వేల రూపాయలు పారితోషకం తో పాటు ఈ అవార్డును అందుకోనున్నట్లు వారు తెలిపారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు,గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో టీడీపీ ఎస్సి ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడి మృతి



**కోవెలకుంట్ల జులై 18నందిపత్రిక** కోవెలకుంట్ల ఆళ్లగడ్డ ప్రధాన రహదారి పై పేరా బిల్డింగ్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బీమునిపాడు గ్రామ వాసి బోధనం బాలానాగన్న(58) దుర్మరణం చెందారు. ఈయన తెలుగుదేశం పార్టీ సభ్యుడిగా ఉంటూ కూటమి ప్రభుత్వం లో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. శనివారం నాగన్న తన బైక్ పై కోవెలకుంట్లకు వస్తుండగా పేరా బిల్డింగ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

**బస్ ను ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదం..ఎస్సై**

ప్రమాద సంఘటనను ఎస్సై మల్లికార్జున రెడ్డి వివరిస్తూ బీమునిపాడు నుండి కోవెలకుంట్లకు వస్తున్న బాలనాగన్న పేరా బిల్డింగ్ సమీపంలోకి రాగానే ముందున్న ఆర్టీసీ బస్ ను ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించగా బస్ వేగంగా వెళ్తుండడంతో నాగన్నకు బస్సు డోర్ తగిలి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలు అయి అక్కడిక్కడే మృతి చెందినట్లు మా ప్రాథమిక దర్యాప్తు లో వెల్లడయిందని తెలిపారు. బస్ డ్రైవర్ అల్లాబకాష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

# ఛాంపియన్ షిప్ కప్ పోస్టర్ల ఆవిష్కరణ



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 18:** బండి ఆత్మకూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అమరావతి ఛాంపియన్ షిప్ కప్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో వీ సి ఎం డి వారి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి ఛాంపియన్షిప్ కప్ పోటీలలో భాగంగా వివిధ మండలాలలో ప్లేయర్స్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టబడింది. శ్రీశైలం నియోజకవర్గంలో శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు త్వరలో జూలై నెలలో ఆత్మకూరులో జరిగే అమరావతి ఛాంపియన్షిప్ పోటీలలో భాగంగా క్రీడలను నిర్వహించడానికి ఆత్మకూరు కాన్స్టిట్యూషన్ లో ఉన్న ప్రతి మండలంలో క్రీడల ను విజయవంతం చేయడానికి ఆత్మకూర్ కాన్స్టిట్యూషన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మున్నా ఆధ్వర్యంలో ఈ క్రీడలు విజయవంతం చేయడానికి బండి ఆత్మకూరు మండలానికి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు బండి ఆత్మకూరు మండలం మండల విద్యాశాఖ అధికారి యశోద నేతత్వంలో అమరావతి ఛాంపియన్షిప్ కప్ పోస్టర్లను బండి ఆత్మకూరు జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వెంకటనారాయణ, ఆత్మకూరు కాన్స్టిట్యూషన్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కెవికె స్టేడియం ఇన్చార్జ్ మున్నా ఆవిష్కరించడమైనది. ఈ కార్యక్రమంలో బండి ఆత్మకూరు మండలం స్పోర్ట్స్ కోఆర్డినేటర్ దండే నాగరాజు సిఆర్పిలు పాల్గొన్నారు

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం



**రుద్రవరం ప్రతినిధి జులై 18 (నంది పత్రిక):** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, పశుసంవర్ధక ఏడిఏ డాక్టర్ మనో రంజన్ ప్రతాప్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రుద్రవరంలో శనివారం ఎంపీడీవో ఆధ్వర్యంలో అధికారులు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇప్పటివరకు ప్రజలకు అధికారులు పిలుపునిచ్చారు. గ్రామంలో సేకరించే తడి చెత్త పొడి చెత్త ఉపయోగాలపై పారిశుద్ధ్య కార్మికులకు అధికారులు వివరించి కాలనీలలో ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి బాలాంజనేయులు, మండల పరివేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్, ఇన్చార్జి ఈవో వడ్డే రామకృష్ణుడు, ఆయాశాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు పొదుపు మహిళలు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# కొండమాయపల్లెలో ఘనంగా ముగిసిన జాతర్లు

**రుద్రవరం ప్రతినిధి జులై 18 (నంది పత్రిక):** మండల పరిధిలోని కొండమాయపల్లె గ్రామంలో జాత్తలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం గ్రామంలో జాత్తలు కన్నుల పండువగా జరిగాయి. జాత్తలు ముగిసిన అనంతరం, శనివారం రోజున రామ్ కాశీం స్వామి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కొండమాయపల్లె గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



## మన కడప స్వచ్ఛ కడప ప్రతి ఒక్కరి బాధ్యత ఎమ్మెల్యే మాధవి...



**నంది ప్రతినిధి, జులై 18, వైయస్సార్ కడప జిల్లా** నగరంలోని ఎన్టీఆర్ శక్తిలో శనివారం ఉదయం మన కడప స్వచ్ఛ కడప కార్యక్రమాన్ని 29వ డివిజన్ 30 డివిజన్ నందు జియావుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప శాసనసభ్యులు మాధవరెడ్డి, తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని హోటల్స్ హాస్పిటల్స్ చిన్న చిన్న దుకాణాలు, స్కూల్స్, అనేక సంస్థలు తాము ఉపయోగించే చెత్తను కొంతమంది పక్కనే ఉన్న కాలువలో వేయడం వలన మురికి అనేది నిలిచిపోతుందని తెలిపారు. దీనివలన వర్షం వచ్చినప్పుడు నీళ్లు వెళ్లలేకపోవడం వల్లన పైనుండే ప్రాంతాల్లో అలాగే పేరుకుపోతుందని తెలిపారు. ఇక ముందు ఎవరైనా సరే అంగడి వద్ద, ఈ దుకాణం వద్ద, సమస్తవద్దైన చెత్త ఉంటే వారిని వెంటనే ఫైన్ వేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆదేశించారు. మన కడప స్వేచ్ఛ కడప ప్రతి నగర పౌరుని బాధ్యతని కమిషన్ భవాని ప్రసాద్ అక్కడున్న ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాడు. గృహంలో ఇళ్లల్లో ప్రజలందరూ కూడా చెత్త పైన అవగాహన కలిగి చెత్తకు కేటాయించిన స్థలాల్లోని చెత్తను వేస్తే పరిశుభ్రంగా ఉంటుందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు సిబ్బంది టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ నజీముద్దీన్, మన్సూర్ అలీ ఖాన్, రెడ్డయ్య యాదవ్, బాలకృష్ణారెడ్డి, శిలాస్, అమర్నాథ్ రెడ్డి, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆదేశాల మేరకు...




**నంది పత్రిక ఆత్మకూరు..** ఈరోజు ఆత్మకూరు పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రివర్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిన్న ఆవిష్కరించిన జగన్ 2.0 యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించి, యాప్ వినియోగంపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లు, బూత్ స్థాయిలో నిర్వహించిన మినిట్స్ ఆఫ్ మీటింగ్లో లో నమోదు చేసిన ఏ ఎస్ డి డి వివరాలపై సమగ్ర అవగాహన కల్పిస్తూ, వాటి సేకరణ, పరిశీలన మరియు సమర్పణ విధానంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మరియు వెలుగోడు పట్టణ, మండల అధ్యక్షులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బి ఎల్ ఏ లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానంలో విరామ దర్శనంలో మార్పులు



**శ్రీశైలం జూలై18(నంది పత్రిక)** శ్రీశైలక్షేత్రాన్ని దర్శించే భక్తులరద్దీ రోజురోజుకు అనూహ్యంగా పెరుగుతున్న కారణంగా సామాన్య భక్తుల సౌకర్యార్థం శని,ఆది,సోమవారాలలో విరామ దర్శన విధానంలో మార్పులు చేసినట్లుగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ యం.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శని,ఆది,సోమవారాలలో ఉదయం వేళలలో మనమిత్ర వాట్సప్ మరియు ఆన్‌లైన్ ద్వారా స్పర్శదర్శనం టికెట్లను ముందస్తుగా పొందిన భక్తులకు మాత్రమే స్పర్శదర్శనం కల్పించబడుతుందన్నారు. అదేవిధంగా ప్రముఖులు స్వయంగా విచ్చేసినప్పుడు మాత్రమే ఉదయం వేళలలో ప్రాధాన్యతను బట్టి ప్రముఖులకు ఈ స్పర్శదర్శనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కాగా ప్రముఖులు అందజేసే సిఫారసు లేఖలపై వచ్చే భక్తులకు అవకాశాన్ని బట్టి రాత్రివేళలలో అనగా రాత్రి గం.9.00ల నుంచి మాత్రమే స్పర్శదర్శనానికి వీలు కల్పించడం జరుగుతుందన్నారు. సిఫారసు లేఖలపై వచ్చే భక్తులకు ఉదయం వేళలలో స్పర్శదర్శనానికి అవకాశం ఉండదన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ఈ మార్పుల వల్ల సర్వదర్శనం క్యూలైన్లలోని ( ఉచిత దర్శనం క్యూలైన్ ) సాధారణ భక్తులు మరియు శీఘ్ర, అతిశీఘ్ర దర్శన భక్తులు అధిక సమయం వేచివుండకుండా శ్రీస్వామిఅమ్మవార్లను మరింత సులభతరంగా దర్శించుకునే అవకాశం కలుగుతుందన్నారు. భక్తులు ఈ మార్పులు గమనించి దేవస్థానానికి సహకరించాలని ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

## దళితుల సమస్యలు పాలకులకు పట్టవా?

**- కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాలు.**

**కొత్తపల్లి – నంది పత్రిక :** ప్రభుత్వాలు మారుతున్న దళితుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఏమాత్రం మారడం లేదని దళితుల సమస్యలు పాలకులకు పట్టవా అని కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్ సంపత్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు ప్రశ్నించారు శనివారం మండలంలోని గువ్వ లగుంట్ల గ్రామంలో కెవిపిఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సామాజిక శంఖారావం పేరుతో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గువ్వలగుంట్ల గ్రామంలో దాదాపు 200 దళిత కుటుంబాలు ఉన్నాయి దళిత కాలనీలకు మంచినీటి పైపైన్లు ఉన్నప్పటికీ వారం పది రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు వస్తున్నాయని మంచినీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు అన్నారు దళితుల ప్రధానంగా స్మశాన సమస్యను ఎదుర్కొంటున్నారని పెరుగుతున్న జనాభా కనుగుణంగా స్మశాన స్థలం కేవలం ఒక అరయకరంలో ఉండడంతో శవాలను పూచిన గుంతలలోనే మళ్లీమళ్లీ పూడ్చుతున్నారు జీవో నెంబర్ 1235 ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు ఎక్కడ అమలు చేయడం లేదని ఆరోపించారు ఎప్పుడోఇచ్చిన పక్కా గృహాలు కూలిపోయే దశకు వచ్చాయని మళ్లీ పక్కా గృహాల కొరకు అప్లై చేసుకుంటే ఆన్లైన్ లో నమోదు కావడం లేదని ఈ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు కొత్త ప్రభుత్వం వచ్చాక ఇతరులకు 40 పక్క గృహాలు మంజూరు చేసి ఎస్సీ లకు మాత్రం మూడు పక్కా గృహాలు మాత్రమే మంజూరయ్యాయని దీన్నిబట్టే ప్రభుత్వం దళితుల పట్ల వివక్షత చూపుతుందని అర్థమవుతుందన్నారు దళిత కాలనీలలో మరుగుదొడ్లు లేక మహిళలు అవస్థలకు గురవుతున్నారు కొత్తగా మరుగుదొడ్లు మంజూరు చేయమని పంచాయతీ అధికారులను అడిగితే నిధులు లేవని మంజూరు చేయలేము అని చెప్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు ఈ గ్రామం నుండి ప్రతి సంవత్సరం దళితులు వలసలు విపరీతంగా వెళ్తున్నారని వలసలను నివారించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు ఈ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కృషి చేసేందుకు ప్రజల సహకారం కావాలని వారు విజ్ఞప్తి చేశారు

ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరరావు స్థానికులు రాజ్కుమార్ చంద్రమౌళి లింగస్వామి మార్క్ రాజశేఖర్ రవి సుబ్బన్న వెంకటయ్య పురుషోత్తం మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు



# శనివారం వస్తే చాలు.. ట్రాఫిక్ కష్టాలు!





### ‘స్త్రీ శక్తి‘ ఉచిత బస్సు ప్రయాణంతో పోటెత్తుతున్న భక్తులు
### ఆటోలు, కార్లతో స్తంభిస్తున్న ట్రాఫిక్..
### మహిళల అవస్థలు
### సీట్ల కోసం బస్సుల వెంట పరుగులు..
### తృటిలో తప్పుతున్న ప్రమాదాలు
### ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**రుద్రవరం ప్రతినిధి జులై 18 (నంది పత్రిక):** మండల కేంద్రమైన రుద్రవరం సమీపంలోని శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులతో ప్రతి శనివారం ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ ‘స్త్రీ శక్తి‘ ఉచిత బస్సు సౌకర్యంతో వస్తున్న మహిళా భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో.. వాహనాల రద్దీ మరియు బస్సుల్లో సీట్ల కొరతతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పోటెత్తుతున్న భక్తులు.. స్తంభిస్తున్న ట్రాఫిక్** శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామికి ప్రతి శనివారం ఘనంగా పూజలు నిర్వహిస్తారు. స్వామివారిని దర్శించుకోవడానికి సమీప గ్రామాలైన నంద్యాల, ఆళ్లగడ్డ, చాగలమర్రి, గాజులపల్లి, శిరివెళ్ల ప్రాంతాల నుంచే కాకుండా, సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళా భక్తుల రాక మరింతగా పెరిగింది. బస్సు అమ్మవారిశాల కూడలి చేరుకోగానే భక్తులను ఆలయం వద్దకు తరలించడానికి ఆటోలు కూడా కూడలిలో నిలిచి ఉంచడం, అదే సమయంలో కార్లలో వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉండటం వల్ల ప్రతి శనివారం రుద్రవరంలోని అమ్మవారి శాల సెంటర్ వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

**సీట్ల కోసం పరుగులు.. ప్రమాదాల అంచున మహిళలు**

దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో బస్సుల్లో సీట్లు దొరుకుతాయో, లేదోనన్న ఆందోళనతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంపులు గుంపులుగా తోసుకుంటూ బస్సులు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో బస్సు ఎక్కే సమయంలో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. గతంలొ సీట్ల కోసం బస్సుల వెంట పరుగులు తీస్తూ మహిళలు కిందపడిపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. గత శనివారం కూడా ఓ వృద్ధురాలు సీటు కోసం బస్సు వెంట పరుగెత్తి కింద పడిపోయినట్లు స్థానికులు తెలిపారు.

**అధికారులు స్పందించాలి: గ్రామస్తుల డిమాండ్**

ఒకవైపు వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభించడం, మరోవైపు సీట్ల కోసం మహిళలు బస్సుల వెంట పరుగులు తీస్తున్న పరిస్థితి చూస్తుంటే.. ఏ క్షణాన ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న సంఘటనలు అయితే పర్వాలేదు కానీ, జరగరాని ఘోర ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి.. ప్రతి శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రుద్రవరంలో ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేసి, మహిళలు ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





## ఈ నెల 20వ తేదీన చలో ఏపీఐఐసి కార్యాలయం దగ్గర మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**కడప జులై. 18** ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తల సబ్సిడీల సాధనకై చలో ఏపీఐఏసి కార్యాలయం దగ్గర మహాధర్నా కార్యక్రమానికి సంబంధించి శనివారం కడప నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు పోస్టర్లు ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, ఆర్,యన్ రాజా,రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ 2022, నుంచి 2026 వరకు పెండింగ్ లో ఉన్న సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిలీజ్ చేయాలని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,000 మంది పైచిలకతో పరిశ్రమలు అయితేనేమి వివిధ బస్సులు లారీలు జెసిపిలు కార్లు యూనిట్ల రూపంలో పెట్టుకుంటే నాలుగేళ్లు పూర్తయి 5వ సంవత్సరం కావస్తున్న ఎస్సీ ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు సబ్సిడీలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంవత్సరంలో పర్సెంటేజీల రూపంలో 20శాతం రిలీజ్ చేయడం జరిగింది ఆ 20శాతం తో ఎస్సీ ఎస్టీ పరిశ్రమ కవితలు అభివృద్ధి చెందుతారా బ్యాంకు లో ఉన్న అప్పు తీరుతుందా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలను నమ్మి అప్పులు చేసి ఇంట్లో ఉన్నారా కొర బంగారును తాకట్టు పెట్టి వెహికల్స్ తెచ్చుకుని బ్యాంకు లో ఈఎంఐలు కట్టలేక పోతున్నాం. అక్కడ ఇక్కడ అప్పు అప్పు తీస్తే అప్పిచ్చిన వాళ్లు తిరిగి కట్టలేదని ఇబ్బందులు పెడుతున్న పరిస్థితి ఏర్పడతా ఉంది ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మా బాధలు మా ఆడతనాదాలు అర్థం చేసుకొని మా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పెండింగ్ లో ఉన్న 700 కోట్ల పైచిలుక మాకు రిలీజ్ చేయాలని చెప్పేసి నిన్నే తూర్లు మొరపెట్టుకున్నాం కానీ ఫలితం లేకున్నా పోతా ఉంది రాష్ట్రంలో ఉన్న అన్ని శాఖలకు మీరు న్యాయం చేస్తున్నారే మరి మా ఎస్సీ ఎస్టీ పరిశ్రమకు సంబంధించిన సబ్సిడీలను ఎందుకు రిలీజ్ చేయలేకపోతున్నారు ఈ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలు పారిశ్రామికవేత్తలు అవ్వడం మీకు ఇష్టం లేదా భవిష్యత్తులో ఎస్సీ ఎస్టీలు పరిశ్రమ శాఖలో యూనిట్లు తీసుకోవడం మీకు ఇష్టం లేదాని మేము అడుగుతున్నాం. ఈనెల 20వ తేదీ సోమవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం దగ్గర జరగబోవు మహా ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలు అందరు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని మనకు రావాల్సిన సబ్సిడీలను మనం సాధించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలపల్లి ఓబులుపతి,కొట్టం సుబ్బారావు,మల్లెల జగదీష్, కొడవలపల్లి వెంకటసుబ్బయ్య,కనకరాజు,కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వర్గధామం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

### ఏకలవ్య నగర్ హిందూ స్మశాన వాటికలో పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా
### స్వర్గధామానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అంచనా నివేదిక సిద్ధం చేయాలని మునిసిపల్ అధికారులకు ఆదేశం

**నంద్యాల బ్యూరో, జూలై 18(నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న “స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర“ కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలోని ఏకలవ్య నగర్ సమీపంలోని హిందూ స్మశాన వాటిక (స్వర్గధామం)లో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొని స్మశాన వాటిక ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే చర్యలను పరిశీలించారు. అనంతరం స్వర్గధామం ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, స్వర్గధామంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను పరిశీలించి, నంద్యాల మున్సిపాలిటీ ద్వారా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన పనులపై అంచనా (ఎస్టిమేట్) సిద్ధం చేసి, దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వర్గధామానికి ఎనిమిది వార్డుల ప్రజలు సేవలు పొందుతున్నారని, అక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రాంగణానికి ఆకర్షణీయమైన పెయింటింగ్‌లు వేయడం, విస్తృతంగా పచ్చదనం అభివృద్ధి చేయడం, అంత్యక్రియల కోసం ఆధునిక షెడ్ ఏర్పాటు చేయడం, మరుగుదొడ్లు, స్నాన సౌకర్యాలు కల్పించడం, ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించే శ్లోకాలతో కూడిన గోడ చిత్రాలు ఏర్పాటు చేయడం, అంత్యక్రియల సమయంలో అవసరమైన సమాచారాన్ని అందించే విధంగా సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది అని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను తమ దైనందిన జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని సూచించారు. స్వర్గధామం అభివృద్ధికి స్థానిక పెద్దలు, ప్రజల సహకారం, జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు, సిబ్బంది, స్థానిక పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

## వరుణ దేవుడి కరుణ కోసం ప్రత్యేక పూజలు.. పూర్వ వైభవం సంతరించుకున్న వెలుగోడు గ్రామం

### తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో పూజలు, భజనలు

### చివరి రోజు అన్నదాన కార్యక్రమం



**వెలుగోడు, జూలై 18 (నంది పత్రిక):** వర్షాలు సమృద్ధిగా కురిసి రైతుల పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ వెలుగోడు గ్రామంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పూర్వకాలం నుంచి కొనసాగుతున్న సంప్రదాయాన్ని గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు మరోసారి ఈ ఆచారాన్ని పునరుద్ధరించారు. ఇటీవల వర్షాభావం కారణంగా రైతులు సకాలంలో సాగు పనులు చేపట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ పెద్దల సమావేశం వరుణ దేవుడికి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ గ్రామంలోని అన్ని వీధుల్లో భక్తి భజనలు, తాళాలతో ఊరేగింపు నిర్వహించి ప్రతి ఇంటి వద్ద దూప, దీప, నైవేద్యాలు సమర్పించుకునే కార్యక్రమం కొనసాగనుంది. గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా దక్షిణలు సమర్పిస్తూ పూజల్లో పాల్గొంటున్నారు. తొమ్మిదవ రోజు వరుణ దేవుడికి మహాపూజలు నిర్వహించి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడంతో పాటు గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పూజ కార్యక్రమం శుక్రవారం ప్రారంభం కాగా, రెండో రోజు శనివారం స్థానిక తెలుగు పేటలోని లింగమయ్య ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని భక్తిశ్రద్ధలతో వరుణ దేవుడిని ప్రార్థించారు.

## టిడిపి కార్యకర్తకు మాతృ వియోగం.

### వారి నివాసనికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంఎల్ఏ కోట్ల.



**బేతంచెర్ల జులై 18 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త జక్రియ వారి తల్లి ఇటీవల పరమపదించిన విషయం తెలిసిన గౌరవ డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి శనివారం నాడు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండల టిడిపి కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, టిడిపి సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, మండల పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ లో వర్క్ కల్చర్ పై భారతీయుడి వ్యాఖ్యలు వైరల్

జపాన్‌లో ఉద్యోగం చేస్తున్న ఓ భారతీయుడు అక్కడి పని సంస్కృతిపై సరదా వ్యాఖ్యలతో చేసిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అక్కడి ఉద్యోగి అనుకూల విధానాలను ప్రశంసిస్తూ, భారతీయ కార్యాలయాల్లోని పరిస్థితులతో పోలుస్తూ అతను వెరైటీగా చేసిన ఈ పోస్ట్‌కు నెటిజన్ల నుండి విశేష స్పందన లభిస్తోంది. గత 11 ఏళ్లుగా జపాన్‌లో నివసిస్తున్న అజయ్ పాండే అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వీడియోను పంచుకున్నారు. జపాన్ కార్యాలయాల్లోని దుర్భరమైన పరిస్థితులంటూ ఆయన కొన్ని అంశాలను తమాషాగా ప్రస్తావించారు. వారానికి మూడు రోజులు మాత్రమే ఆఫీస్‌కు వెళ్లడం, వారాంతాల్లో పని ఒత్తిడి అస్సలు లేకపోవడం, అదనపు సమయం పని చేస్తే ప్రతి 15 నిమిషాలకు లెక్కగట్టి మరీ వేతనం చెల్లించడం, సాధారణ బహుమతులకు బదులుగా ఏకంగా కొన్ని నెలల జీతాన్ని బోనస్‌గా ఇవ్వడం వంటి విషయాలు తనకు నచ్చడం లేదని చిరుకోపం నటించారు. “మా మేనేజర్ వారాంతాల్లో కనీసం ఒక్క ఫోన్ కాల్ కూడా చేయడు. నన్ను అస్సలు పట్టించుకోడు. అప్పుడప్పుడైనా పిలిస్తే బాగుండు కదా?“ అంటూ ఆయన చమత్కరించారు. ఓవర్ టైమ్ చేయడానికి దాదాపుగా అనుమతి ఇవ్వరని, ఒకసారి అనుమతి లభిస్తే మాత్రం ప్రతి నిమిషానికి కచ్చితంగా వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ఆకట్టుకుంటోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. ‘బ్రో.. నువ్వు విజయంతో బాధపడుతున్నావు‘, ‘మా కలను నువ్వు జీవిస్తున్నావు’ అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవలి కాలంలో జపాన్‌లో స్థిరపడిన భారతీయులు అక్కడి పని క్రమశిక్షణ, వ్యక్తిగత సమయానికి ఇచ్చే ప్రాధాన్యత వంటి అంశాల గురించి తరచూ సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు.

## జగన్ 2.0 సూపర్ యాప్‘ పోస్టర్ను ఆవిష్కరించిన మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూలై 18 నంది పత్రిక** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన “జగన్ 2.0 సూపర్ యాప్“ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఘనంగా ఆవిష్కృతమైంది. వైకాపా మాజీ ఎమ్మెల్సీ మాజీ ప్రభుత్వ విప్పు గంగుల ప్రభాకర్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు శనివారం నాడు పట్టణంలోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం ఆవరణలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి వైకాపా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఈ యాప్‌ను అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ‘జగన్ 2.0 సూపర్ యాప్‘ కేవలం సాంకేతిక అప్లికేషన్ మాత్రమే కాదని, ప్రతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చేతిలో ఉండాల్సిన శక్తివంతమైన డిజిటల్ ఆయుధం అని అభివర్ణించారు.

**యాప్ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన పేర్కొన్న ముఖ్యాంశాలు:** ప్రజలతో ప్రత్యక్ష బంధం: పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు ప్రజలతో నేరుగా అనుసంధానం అయ్యేందుకు ఈ యాప్ ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుంది. వేగవంతమైన ప్రచారం: పార్టీ సిద్ధాంతాలు, వైఎస్సార్సీపీ చేపడుతున్న సేవా కార్యక్రమాలతో పాటు ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా సమస్యలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సందర్భంగా మొబైల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, దాని పనితీరును, వినియోగ విధానాన్ని కార్యకర్తలకు క్షుణ్ణంగా వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త ఈ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల రాజారెడ్డి, భాస్కర్ రెడ్డి ఓబులంపల్లి రామ్మోహన్ రెడ్డి, సునీల్, దామోదర్ రెడ్డి, మాదం చెన్నయ్య, రమేష్ గౌడ్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహానందీశ్వర స్వామివారి హుండీ ఆదాయం రూ. 52.50 లక్షలు



**మహానంది, జూలై 18 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో శనివారం హుండీ లెక్కింపు నిర్వహించారు. 50 రోజులకు గాను హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా దేవస్థానానికి రూ. 52,50,131 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రధాన ఆలయాల్లోని హుండీల ద్వారా రూ. 51,70,417 లక్షలు, అన్న ప్రసాదం ద్వారా రూ. 55,670 వేలు, గో సంరక్షణ ద్వారా రూ. 24,044 వేలు వచ్చిందన్నారు. అలాగే హుండిలో మలేషియా 1 రింగ్-3 నెంబర్ లభించాయన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ గ్రూప్ టెంపుల్ ఇన్స్పెక్టర్ హరిచంద్రా రెడ్డి,,దేవస్థానం ఏఈవో మధు, పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, నీలకంతేశ్వర రాజు,సుబ్బారెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఏజెన్సీ వర్కర్స్, మహానంది ఏ జి బి బ్యాంకు సిబ్బంది, పలు జిల్లాల శ్రీ బాలాజీ,తిరుమల బాలాజీ సేవా సమితి,శ్రీరామ సేవా ట్రస్ట్ సేవకులు,భక్తులు పాల్గొన్నారు.



## రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై జాగ్రత్త వహించాలి

### - దళిత రైతులకు అండ

### - ఏపీ స్టేట్ ఎస్సీ కమిషన్ మెంబర్లు మేకల దాసు, గౌతమ్ రాజ్



**కొత్తపల్లి - నంది పత్రిక :** రెవెన్యూ అధికారుల భూ సమస్యలపై జాగ్రత్త వహించకపోవడం వల్ల భూ సమస్య ఏర్పడ్డాయని దళిత రైతులకు ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందని ఏపీ స్టేట్ ఎస్సీ కమిషన్ మెంబర్లు మేకల దాసు, గౌతమ్ రాజ్ తెలిపారు. శనివారం మండలంలోని దుద్యాల, ఎర్రమఠం గ్రామాల్లో ఉన్న దళిత బాధిత రైతులను పరామర్శించి సమస్య ఉన్న భూముల ప్రదేశానికి వెళ్లి ఇరు వర్గాలతో సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే గ్రామాల్లో భూ సమస్యలు ఏర్పడ్డయన్నారు. దళిత రైతులు ఎర్ర మఠం గ్రామానికి చెందిన ఎలకంటి ఓబులేసు, దుద్యాల గ్రామానికి చెందిన సురేష్ అనే దళిత రైతులు తమ భూ సమస్యల నిమిత్తం ఎస్సీ కమిషన్ చైర్మన్ ను ఆశ్రయించగా ఎస్సీ కమిషన్ చైర్మన్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇరువురి పత్రాలను, సంబంధిత అధికారులతో మాట్లాడడం తెలుసుకోవడం జరిగిందన్నారు. దళిత రైతులకు ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే దళితులకు అన్యాయాలు జరుగుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు 15 రోజుల లోపల ప్రత్యేక చొరవ తీసుకొని ఈ సమస్యకు ఇరు వర్గాలతో తమ దగ్గర ఉన్న భూమికి సంబంధించిన ఆధారాలు తీసుకొని నిజమైన రైతులకు న్యాయం చేయాలన్నారు. దళితులకు పూర్వీకుల ద్వారా సంక్రమించిన ఆస్తిని అగ్రకులాల వారు అక్రమంగా వేసుకొని వారిపైనే దాడులు చేసిన ఏ అధికారి పట్టించుకోనే పాపాన పోలేదు అన్నారు. దీంతో దళిత రైతులు ఎస్సీ కమిషన్ ఆశ్రయించగా బాధిత దళిత రైతులకు ఎస్సీ కమిషన్ అండగా ఉంది అన్నారు. దళిత రైతుల భూములకు ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడూ రక్షణగా ఉంటుంది అన్నారు. గ్రామాల్లో రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి అంటే రెవెన్యూ అధికారుల పనితీరే ఇందుకు నిదర్శనం అన్నారు. రెవెన్యూ అధికారులు ఒకే వర్గానికి కొమ్ముకాసే మాటలు చెప్పడం చాలించి పనిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ మండలంలో ఎక్కువ శాతం క్షేత్రస్థాయిలో అనుభవంలో ఒకరు ఆన్లైన్లో మరొకరు ఉండడం సమస్య ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ తప్పిదాలన్నీ రెవెన్యూ అధికారులే బాధ్యత అని గుర్తు చేశారు. మీరు చేయకపోయినా గతంలో మీ స్థానంలో ఉన్న రెవెన్యూ అధికారుల తప్పిదాల తోనే ఇలాంటి గొడవలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఇక్కడ జరిగిన సమస్యను ఎస్సీ కమిషన్ చైర్మన్ కు అందజేస్తామన్నారు. ఇలాంటి సమస్యలు రాబోవు రోజుల్లో పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చూసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. వీరి వెంట ఆర్డిఓ వెంకట శివ సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ శివారెడ్డి తహసిల్దార్ ఉమారాణి ఎస్సై సురేష్ పలువురు ఉన్నారు.

## గ్రామస్తుల పట్టుదల-మంత్రి కృషితో అంబాపురానికి ఆర్టీసీ బస్సు.



**బేతంచెర్ల జులై 18 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం అంబాపురం గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరింది. గ్రామస్తుల పట్టుదల మరియు రాష్ట్ర రోడ్లు & భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన రెడ్డిని కలిసి అంబాపురం గ్రామం లోకి ఆర్టిసి బస్ రావాలి అని వినతి పత్రం సమర్పించారు. మంత్రి ప్రత్యేక చొరవతో అంబాపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు వస్తున్నది. బేతంచెర్ల మండలంలోని అంబాపురం గ్రామానికి చాలా రోజుల నుండి సరైన రోడ్డు సౌకర్యం లేక, ప్రయాణాలకు ఇబ్బంది పడ్డారు. రోడ్డు మెరుగు పడటంతో బనగాన పల్లె నుండి యాగంటి దేవస్థానం మీదుగా శ్రీ మద్దులేటి స్వామి దేవస్థానం వరకు ప్రస్తుతం నడుస్తున్న బస్సును,అంబాపురం గ్రామంలోకి వెళ్లాలని మంత్రి బీసీ.జనార్ధన రెడ్డి ఆర్టిసి అధికారులను ఆదేశించారు. స్పందించిన ఆర్టిసి అధికారులు అంబాపురం గ్రామంలోకి బస్ పోయి,వచ్చుటకు నిర్ణయం తీసుకున్నారు. అంబాపురం గ్రామ ప్రజల సమస్య తీరింది. ఆర్టిసి బస్ రావాలని ,పి.రామ మోహన్,సూర్యనారాయణ, మురళి,తిమ్మయ్య,మధు శేఖర్ లు గ్రామ ప్రజల తరుపున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోకి బస్సు రాకతో విద్యార్థులు, రైతులు, వృద్ధులు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలందరూ మంత్రికి నమస్కారములతో ధన్యవాదములు తెలిపారు. అలాగే ఆర్టీసీ అధికారులకు కూడా ధన్యవాదములు తెలిపారు.

## లింగ నిర్ధారణ చట్ట రిత్య నేరము: బద్వేల్ డివిజన్ రెవెన్యూ అధికారి చంద్రమోహన్



**బద్వేల్, జులై 18 (నంది పత్రిక):** బద్వేల్ రెవిన్యూ డివిజన్ కార్యాలయం నందు రెవెన్యూ డివిజనల్ అధికారి హచ్ చంద్ర మోహన్ మరియు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి. రాజేంద్ర ప్రసాద్ వారి ఆదేశాల మేరకు సబ్ డిస్ట్రిక్ మల్టీ మెంబర్స్ అథార్టీ కమిటీ సమావేశం ఏర్పాటు ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో సబ్ డిస్టిక్ లెవెల్ సమావేశము ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ చంద్రమోహన్ గారు మాట్లాడుతూ ప్రైవేటు మరియు గవర్నమెంట్ హాస్పిటల్ నందు స్కాన్ సెంటర్ నందు లింగ నిర్ధారణ జరగకూడదు అటు జరిపిన వారి పైన కఠిన చర్యలు తీసుకునిబడును ప్రైవేట్ మరియు గవర్నమెంట్ హాస్పిటల్ నందు స్కానింగ్ తీసుకుని సమయంలో ఆడ మగ అని లింగ నిర్ధారణ చేపట్టిన వారికి కఠినంగా శిక్షించవలనని వైద్యాధికారులకు ఆదేశాలు ఇవ్వడమైనది అన్ని రెవెన్యూ డివిజన్ అధికారి తెలియజేయడమైనది ఉప జిల్లా వైద్యం మరియు ఆరోగ్య శాఖ డాక్టర్ బి మల్లేష్ బద్వేల్ వారు మాట్లాడుతూ మగ ఆడ అన్ని స్కానింగ్ సెంటర్లో తెలియజేస్తుంటే అటువంటి ఆస్పత్రులు మూసివేయబడునని తెలియజేయడమైనది ఈ కార్యక్రమంలో డాక్టర్ బి రాజేష్ కుమార్ డాక్టర్ వై. శ్రీనివాసులు డాక్టర్ శరత్చంద్ర డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య హెల్త్ సూపర్వైజర్స్ శివరాం రెడ్డి వి.జనార్దన్ రావు, శ్రీ రామయ్య మరియు ఆశా కార్యకర్తలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## పేరాయిపల్లెలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర

**ఆళ్లగడ్డ ప్రతినిధి జులై 18, నంది పత్రిక** ఆళ్లగడ్డ మండల పరిధిలోని పేరాయపల్లి జడ్పీహెచ్ హైస్కూల్ లో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ ఆవరణంలో శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల అభివృద్ధి అధికారి నూర్జహన్, డిప్యూటీ ఎంపీడీవో సరళ, ఎంఈఓ శోభా వివేకమతి, మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, మాజీ సర్పంచ్ ఉపేంద్ర, మండల స్థాయి అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# మన భూమా మన ధీమా కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ







### రైతులందరూ తరపున భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**దొర్నిపాడు జూలై 18 నంది పత్రిక** మన భూమా మన ధీమా అనే కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ తాలూకా దొర్నిపాడు మండలం అర్జునాపురం గ్రామంలో 53 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రోడ్డును ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ ఈరోజు “మన భూమా మన ధీమా“ కార్యక్రమంలో భాగంగా దొర్నిపాడు మండలం అర్జునాపురం గ్రామంలో పర్యటించడం చాలా ఆనందంగా ఉందన్నారుఈ గ్రామానికి ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న దొర్నిపాడుఅర్జునాపురం రహదారిని రూ. 53 లక్షల వ్యయంతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

ఎన్నో సంవత్సరాలుగా ఈ రహదారి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ సమస్యను గుర్తించి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లాం. నేడు ఆ రహదారి పూర్తై ప్రజలకు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమన్నారు గ్రామస్తులు కాలువలు, అంతర్గత రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రజలకు హామీ ఇస్తున్నామని అలాగే ఈ ఏడాది వర్షాల పరిస్థితిపై నిపుణులు చేస్తున్న సూచనలను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అయితే రైతులందరి తరపున భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నామని అర్జునాపురం గ్రామ అభివృద్ధికి మా ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని,ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తాం అని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియా తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ రహిత పట్టణం గా తీర్చిదిద్దుదాం.





## జిల్లా జాయింట్ కలెక్టర్ కే.ఆర్ కల్పశ్రీ

**భీమవరం బ్యూరో చీఫ్ జులై 18 నందిపత్రిక** పట్టణంలో భారీ వ్యర్థాల ఉత్పత్తిదారులను గుర్తింపు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ తెలియజేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం "బల్క్ వేస్ట్ జనరేటర్ల గణన " అంశంపై జువ్వలపాలెం రోడ్డు, అయ్యప్ప స్వామి గుడి వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ మాట్లాడుతూ పట్టణాన్ని ప్లాస్టిక్, చెత్త రహిత నగరంగా రూపుదిద్దుటకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని అన్నారు. భీమవరాన్ని భవ్య భీమవరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. పట్టణాన్ని సుందరీకారంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. పట్టణంలో ని అపార్ట్మెంట్లు, వెల్ఫేర్ అసోసియేషన్లు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఆసుపత్రులు,విద్యాసంస్థలు, కల్యాణ మండపాలు, పబ్లిక్ ఇన్ఫ్రా స్ట్రక్చర్స్ అయినా రైల్వే, బస్ స్టేషన్లు వంటి ప్రాంతాలలో ఉన్న సంస్థలను సర్వేచేసి భారీ వ్యర్థాల ఉత్పత్తిదారుల ను గుర్తించాలని అన్నారు. రోజుకు 100 కిలోలు లేదా అంతకంటే ఎక్కువ ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థలు, 20,000 చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ బిల్ట్ -అప్ ఏరియా కలిగిన సంస్థలు, రోజుకు 40 వేల లీటర్లు లేదా అంతకంటే ఎక్కువ నీటిని వినియోగించేవారు భారీ వ్యర్థాల ఉత్పత్తిదారులు గా పరిగణిస్తారని అన్నారు. పట్టణంలోని ప్రజలు తమ ఇంటిలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించవలసిన బాధ్యత ఉందని అన్నారు. క్లీన్ భీమవరం గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని తెలియజేశారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు పారిశుద్ధ్య కార్యక్రమాల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కలిగే విధంగా తెలియజేయాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ పై హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మాల్స్ యజమానులు పూర్తి అవగాహన కలిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని అన్నారు. డ్వాక్రా మహిళలు, సెక్రటరీలు పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాల పట్ల ప్రతి వార్డులో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం నిషేధం బ్రోచర్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ, మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఏ. రాంబాబు, కంతేటి వెంకటరాజు, ప్రముఖ సాంఘిక సంఘసంస్కర్త చెరుకువాడ రంగసాయి తో కలిసి పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి,

అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఏ. రాంబాబు, ప్రముఖ సాంఘిక సంఘసంస్కర్త చెరుకువాడ రంగసాయి, డ్వాక్రా మహిళలు, పాఠశాల కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..





# విద్యార్థులు యువత ఉద్యోగస్తులు గ్రంధాలయ సేవలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి





## జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ

**భీమవరం, బ్యూరో చీఫ్ జులై 18 నంది పత్రిక** భీమవరం పట్టణంలోని వీరమ్మ పార్కు వద్ద ఉన్న డాక్టర్ వైయస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాన్ని జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ శనివారం ఉదయం సందర్శించారు. గ్రంథాలయంలో ఉన్న సౌకర్యాలు, పుస్తకాల విభాగాలు, పాఠకులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. గ్రంథాలయంలో ఉన్న సమస్యలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న న్యూస్ పేపర్లు సరిపోవడం లేదని అదనంగా న్యూస్ పేపర్లు కావాలని, శాఖా గ్రంథాలయం సెలవు రోజున కూడా తెరిచి ఉంచాలని పాఠకులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాఖ గ్రంథాలయానికి ప్రతిరోజు 150 నుండి 200 మంది వరకు పాఠకులు వస్తున్నారని గ్రంథాలయ అధికారి జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. ఎమ్మెస్కో స్వచ్ఛంద సేవా సంస్థ గ్రంథాలయానికి అందరికీ ఉపయోగపడే 263 పుస్తకాలు బహుకరించారని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు గ్రంథాలయానికి సొంత సొమ్ముతో 15 ట్యూబ్ లైట్లు అందించారని జాయింట్ కలెక్టర్ కు వివరించారు.

గ్రంథాలయాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు సూచించారు. విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ సూచించారు. జాయింట్ కలెక్టర్ వెంట గ్రంథాలయ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, సిబ్బంది పాఠకులు తదితరులు ఉన్నారు..






## రవాణాశాఖ నిబంధలను కఠినతరం

రాష్ట్రవ్యాప్తంగా రవాణా నిబంధనలను కఠినతరం చేశారు. ఉల్లంఘించే వాహనాలపై ఉక్కుపాదం మోపాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించడంతో అధికారులు తగు చర్యలకు దిగుతున్నారు. ముఖ్యంగా స్కూల్ బస్సులతో పాటు, అధికా లోడ్‌తో వెళ్లే వాహనాలపై దృష్టి సారించారు. రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసి, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓవర్‌లోడింగ్ వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలను అవసరమైతే వెంటనే సీజ్ చేయాలని రవాణా అధికారులు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గతంలో చెక్‌పోస్టులను రద్దు చేసిన సమయంలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంటూ తనిఖీల వేగాన్ని పెంచనున్నారు. జూన్ 8 నుంచి ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా రంగంలోకి దించిన మొబైల్ స్క్వాడ్‌ల పనితీరును ఇటీవలే మంత్రి పొన్నం సమీక్షించారు. త్రైమాసిక పన్నులు చెల్లించకుండా ఎగవేస్తున్న వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని.. స్లీపర్ బస్సుల్లో జరిగే నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించకుండా, గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# చింతలపూడిలో 56 కోట్ల అమృత్ నీటి పథకానికి భూమి పూజ చేసిన - ఎమ్మెల్యే రోషన్ కుమార్

**చింతలపూడి ప్రజల దాహార్తి తీరనుంది - శాశ్వత త్రాగునీటి పరిష్కారం**

**15 ఏళ్లకు సరిపోయేలా చింతలపూడిలో కొత్త వాటర్ పథకం**

**చింతలపూడిలో 100 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలకు**

**ఎమ్మెల్యే రోషన్ కుమార్ హామీ**



**విజయవాడబ్యూరో చీఫ్ జులై 18 నంది పత్రిక:** చింతలపూడి పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అమృత్ పథకం కింద రూ 56 కోట్ల వ్యయంతో చేపట్టనున్న త్రాగునీటి సరఫరా పథకానికి చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నిరంతరాయంగా శుద్ధి చేసిన త్రాగునీటిని అందించేందుకు 5 రక్షిత నీటి ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ముందుచూపుతో రాబోయే 15 సంవత్సరాల వరకు అవసరాలకు సరిపోయే విధంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నాణ్యమైన నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనితో పట్టణ ప్రజల దాహార్తి పూర్తిగా తీరుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**వైద్య, విద్య రంగాలకు ప్రాధాన్యం** ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మరికొన్ని అభివృద్ధి హామీలు ఇచ్చారు. చింతలపూడిలో త్వరలో 100 పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు, అదేవిధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను అంకితమని, ప్రజల అవసరాలను గుర్తించి రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు రోషన్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమృత్ డైరెక్టర్ పాండురంగారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సాధనకు చేయిచేయీ కలుపుదాం

**ఆరోగ్యకర సమాజ స్థాపనకై కూటమి ప్రత్యేక దృష్టి**

**ఆదర్శ కార్యక్రమంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర**

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**




**విజయవాడ బ్యూరో చీఫ్ జులై 18 నంది పత్రిక** ఆరోగ్యకర సమాజ స్థాపన సుస్థిరాభివృద్ధి సాధన దిశగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంప చోడవరం అంబేద్కర్ కూడలి వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్రలో భాగంగా స్వచ్ఛత దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సంయుక్త కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ల సౌజన్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు అధికార యంత్రాంగం సాదర స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ పల్లెల్లోనూ పరిశుభ్రత పాటించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆరోగ్యకర సమాజంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గృహ వినియోగదారులు, షాపు యజమానులు ఇలా వ్యర్థాలు బయట పాడేయ కుండా ఒక పద్ధతి ప్రకారం చెత్తను నిల్వచేయాలని అందులోనూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా నిల్వచేయాలన్నారు. అలాగే ఇంట్లో వ్యర్థాలను సైతం నేరుగా కొనుగోలు, వస్తు మార్పిడి ద్వారా సేకరిస్తు న్నట్లు పేర్కొన్నారు. తద్వారా మెరుగైన పద్ధతులు ద్వారా చెత్త ద్వారా సంపద కూడా సృష్టించే విధానాలు ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికీ వెళ్ళి చెత్తను వ్యర్థాలను సేకరించేందుకు వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఈ విధానాన్ని కనీసం పట్టించు కోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఆదర్శ విధానానికి మళ్లీ పుంజుకునేట్లు ప్రభుత్వ పరంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం ఇది ఒక ప్రభుత్వం బాధ్యతగా కాకుండా ప్రతీ పౌరుడు, స్వచంద సంస్థలు నైతిక బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అందరూ సమష్టిగా ఉంటూ స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కులి కంకణబద్దులుగా ఉండాలని కోరారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, రంప చోడవరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ చోటు, జనసేన నాయకులు పాపోలు శ్రీనివాసరావు, సీతపల్లి గడి బాపనమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కుంజం బాపన్నదొర, సభ్యులు సిద్ధా వెంకన్న దొర, నియోజక వర్గ ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా బాపన్న దొర అనే బాబీ, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి, కారం శేషాయమ్మ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కారం సురేష్ బాబు, షేక్ ఆసియా బేగం, పతివాడ రమణ, కడబాల గణపతి రెడ్డి, డిపిఓ కేబి బాబు, శేఖర్ పంచాయతీ కార్యదర్శి కామరాజు డి ఆర్ డి ఏ పి డి రత్నాకర్, ఎంపీడీవో ప్రసాద్, గణపతి,సూరన్న పలు ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం...





**రావులపాలెం అంటేనే సేవా సంస్థలకు పేరెన్నికగన్నది...**

**పేదలు బాగుంటేనే సమాజం బాగుంటుంది...**

**రావులపాలెం లో జరిగిన డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ నాలుగవ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**

**రావులపాలెం బ్యూరో చీఫ్ జూలై 18 నంది పత్రిక**

తోటి వారికి, పేదవారికి సేవ చేయాలనే సేవాసంస్థల సంకల్పం, ఆలోచన ఎంతో అభినందనీయమని, చాలా గొప్పదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా రావులపాలెం శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన, ఆకుల రామకృష్ణతో కల్సి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా డొక్కా సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. పేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదానం, వస్త్రదానం, నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెం అంటేనే సేవా సంస్థలకు పేరెన్నికగన్నదన్నారు. అన్నపూర్ణగా ఈ ప్రాంతానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా తెచ్చిపెట్టిన మహోన్నతురాలు, నిరతాన్నదాత డొక్కా సీతమ్మ అని కొనియాడారు. 2022లో ఆమె పేరుతో ఈ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించడం,నేడు నాల్గవ వార్షికోత్సవం జరుపుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. నిర్వాహకులు రాజేష్, సభ్యుల సేవలను, వారు చేస్తున్న పలు కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు.నేడు రాష్ట్రంలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సైతం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అనే పేరునే పెట్టారని గుర్తు చేశారు. పేదల యొక్క ఆరోగ్యం బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. అందుకోసం కృషి చేస్తున్న డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారిని ఆయన అభినందించారు.



## కొండపల్లి మున్సిపాలిటీలో అత్యాధునిక చెత్త వ్యర్థాల ప్రాసెస్సింగ్ ప్లాంట్ ప్రారంభం.

**ప్రారంభోత్సవంలో పాల్గొన్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో చీఫ్ జూలై 18 నంది పత్రిక** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఖిల్లా రోడ్డు, ఇబ్రహీంపట్నం నిమ్రా కళాశాల సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (పొడి మరియు తడి చెత్త వ్యర్థాల ప్రాసెస్సింగ్ ప్లాంట్) ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొని ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించగా, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అధికారికంగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ఈ ఆధునిక ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీల్లో లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్త మొత్తాన్ని పెద్ద ఎత్తున గుంటూరు దగ్గర ఉన్న ప్లాంట్ కు తరలించి వేస్ట్ టు పవర్ జనరేషన్ ప్రాజెక్టులో చాలావరకు తొలగించారన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని తొలిసారి కొండపల్లి మున్సిపాలిటీలో దీన్ని నెలకొల్పారని వెల్లడించారు. మురుగునీటి కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కొద్దిపాటి వర్షాలకే డ్రైనేజీలు పొంగి ప్రవహించి లోతట్టు ప్రాంతాలు మొత్తం జలమయం అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ ను సద్వినియోగపరుచుకొని కొండపల్లి మున్సిపాలిటీని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణాల్లో రోజురోజుకూ పెరుగుతున్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ ప్రాసెస్సింగ్ ప్లాంట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేయడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడటంతో పాటు ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు. పట్టణంలో చెత్త పేరుకుపోవడం వల్ల కలిగే దుర్వాసనలు, వ్యాధుల వ్యాప్తి, భూకాలుష్యం, వాయు కాలుష్యం వంటి సమస్యలను నివారించడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. చెత్తను శాస్త్రీయంగా ప్రాసెస్ చేయడం ద్వారా వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పరిసరాలను కాలుష్య రహితంగా ఉంచేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడం ద్వారా ఈ ప్లాంట్ పూర్తి స్థాయిలో సద్వినియోగం అవుతుందని, ప్రజల సహకారం ఉంటేనే స్వచ్ఛమైన, హరిత, కాలుష్య రహిత కొండపల్లి లక్ష్యాన్ని సాధించగలమని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య సంరక్షణ, పరిశుభ్రత, సుస్థిర పట్టణాభివృద్ధి దిశగా ఈ ప్రాసెస్సింగ్ ప్లాంట్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. చెత్తను విలువైన వనరుగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది మరో ముఖ్యమైన అడుగని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రేడ్-2 మున్సిపాలిటీగా పెనుకొండ ..





**మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం**

**మంత్రి సవిత ను సన్మానించిన మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ..**

**అనంతపురం బ్యూరో చీఫ్ జూలై 18 నంది పత్రిక**

పెనుకొండ నగర పంచాయతీ గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితను పెనుకొండ మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత పెనుకొండ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మున్సిపల్ సేవలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. సందర్భంగా మున్సిపాలిటీని మరింతగా అభివృద్ధి చేయాలని మంత్రి సవిత తెలిపారు అనంతరం, వివిధ కారణాలతో నగర పంచాయతీలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికులు ఓబులేష్, రాము, నరసింహులు, ముత్యాలప్పల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయ చెక్కులను మంత్రి సవిత పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## విద్యా, వైద్యానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత.

**మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి.**

**రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...**



**ఏలూరు బ్యూరో చీఫ్ జూలై 18 నంది పత్రిక:** ఆగిరిపల్లి మండలం అడివినెక్కలం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాఠశాల ఆటస్థలం, వంటశాల, తదితర మౌళిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వినూత్న మార్పులు తీసుకొస్తున్నారని, ప్రతి విద్యార్థి భావిభారత పౌరులుగా ఎదగాలని అన్నారు, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, లోటుపాట్లు ఉంటే శాఖా పరమైన చర్యలు తప్పవని అన్నారు. విద్యా,వైద్యానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను ఇస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజన అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యం, విద్యాభివృద్ధికి మధ్యాహ్న భోజన పథకం ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు ఉన్నతస్థితికి ఉపాధ్యాయులు మనస్సుపెట్టి పనిచెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవలసిన బాధ్యత మనందరిపై ఉంది.**

**పరిసరాలు పరిశుభ్రతలో ప్రతి ఒక్కరికి దినచర్యల్లో ఒక భాగం కావాలి.**

**స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీపిరిని చేతబట్టి పాఠశాల ప్రాంగణాన్ని తుడిచి శుభ్రంచేసిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...**

**ఏలూరు బ్యూరో చీఫ్: జూలై 18 నంది పత్రిక** ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా "బల్క్ వేస్ట్ జనరేటర్స్ నమోదు, ఘనవ్యర్థాలు నిర్వహణ నియమాలు మరియు పరిశుభ్రత పట్ల అవగాహన" అనే థీమ్ తో కార్యక్రమాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చీపుర్లను చేతబట్టి, విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని తుడిచి శుభ్రం చేశారు. పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు పరిసరాలు పరిశుభ్రత, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేతులను దగ్గర ఉండి శుభ్రం చేయించారు. విద్యార్థులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. మొక్కలను నాటి, అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - 2047 సంకల్పంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్జీఓలు, కార్పొరేటు సంస్థలు, విద్యార్థులు, యువత, సేవా సంస్థలు, స్వచ్ఛందంగా పాల్గొనాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అందరూ పాల్గొని, మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏదో జిల్లాలో పాల్గొని, అందరికీ స్ఫూర్తిని నిశీపుతున్నారని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే, వ్యాధులు సోకుతాయని, ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఆర్థికంగా బలహీనులు అవుతారని అన్నారు. వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. "స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం కేవలం పరిశుభ్రత కార్యక్రమం మాత్రమే కాదని, ఇది ప్రతి పౌరుడు బాధ్యతగా పాల్గొని రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, అభివృద్ధి దిశగా నడిపించే ప్రజా ఉద్యమం అన్నారు. పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు మన ఆరోగ్యానికి, పర్యావరణానికి, భావి తరాలకు అమూల్యమైన సంపద అన్నారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని, మనఇల్లు, మనవీధి, కార్యాలయం, పాఠశాల, ఎక్కడైనా పరిశుభ్రతను పాటించడం ద్వారా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దగలమని అన్నారు. ప్రజలు సహకారంతో చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, ప్లాస్టిక్, క్యారీ బ్యాగులను వినియోగాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా చేస్తే, మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు భాగస్వామ్యం తోడైతేనే ఈ లక్ష్యం సాకారం తప్పక అవుతుందని అన్నారు. మనమంతా కలిసి పనిచేస్తేనే పరిశుభ్రమైన, సుస్థిరమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించగలమని అన్నారు. ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని, పరిశుభ్రతను మన జీవన విధానంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, వివిధ శాఖలు అధికారులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# చేపల వేటలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే





**ప్రభుత్వ పరంగా ఆదు కుంటాము**

**మృత దేహాలను చూసి కన్నీరు పెట్టుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి**

**చేపలవేటలో అజాగ్రత్త మంచిదికాదు**

**ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే**

**గొమ్ము కొత్తగూడెంలో అలుముకున్న విషాద ఛాయలు**

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**కొత్తగూడెం బ్యూరో చీఫ్ జులై 18 నంది పత్రిక** గోదావరి నదిలో చేపల వేటలో మృతిచెందిన కుటుంబాలను రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పరామర్శించారు. ఎటపాక మండలం గొమ్ము కొత్తగూడెంలో శనివారం విషాద ఛాయలు అలముకున్నాయి. గోదావరి నదిలో చేపల వేటకు శనివారం ఉదయం 9:30 గంటలకు గొమ్ము కొత్తగూడెం గ్రామానికి చెందిన 10 మంది గ్రామస్థులు (ఇద్దరు పురుషులు, 8 మంది మహిళలు) గొల్లగూడెం గ్రామం సమీపంలో గోదావరి నదిలో చేపలవేటకు వెళ్లారు. చున్నీలు మరియు దోమతెరలతో చేపలవేటకు వెళ్ళినట్లు గ్రామస్తులు తెలిపారు. చేపల వేట సాగుతున్న సమయంలో 5 గురు (ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు) గోదావరి నదిలో మునిగి పోయారని గ్రామస్తులు పేర్కొన్నారు. మృతిచెందిన వారిలో ఇప్పటివరకు ముగ్గురు మహిళలు మరియు ఇద్దరు పురుషుల మృతదేహాలను గుర్తించారన్నారు. సంఘటన వివరాలు తెలుసుకున్న ఆమె హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను మండల పార్టీ అధ్యక్షులు బొల్లా పుల్లయ్య సౌజన్యంలో ఓదార్చి సంతాపం తెలిపారు.

**మృతిచెందిన వారి వివరాలు**

గొమ్ము కొత్తగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు

(1) ఉకే లక్ష్మి వయస్సు: 37 సంవత్సరాలు

(2) ఉకే సుశీల, వయస్సు: 37 సంవత్సరాలు,

(3) బసిబోయిన బాలరాజు, వయస్సు: 40 సంవత్సరాలు,

(4). తుర్రం భారతి, వయస్సు: 40 సంవత్సరాలు,

(5)ఉకే రమేష్, , వయస్సు: 37 సంవత్సరాలు

మృతిచెందారు. కాగా ఆయా మృతదేహాలను చూసిన ఆమె ఒక్కసారిగా కన్నీటి పర్యాంతమయ్యారు. ఒక్కసారిగా చలించిన ఆమె ఒకే కుటుంబంలో ఇలా జరగటం చాలా దురదృష్టం అని సంతాపం వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాల్ని ఆదుకుంటామని ప్రభుత్వం దృష్టిలో పెడతామని భరోసా ఇచ్చారు. మృతదేహాలకు పంచనామా పోస్ట్ మార్టం త్వరగా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించాలని పోలీసు, వైద్య సిబ్బందికి సూచించారు. మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులు రీత్యా కూడా ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు చేయడం మంచిది కాదన్నారు. ఇలాంటి సంఘటనలు పై పోలీసు అధికారులు ప్రజలకు చైతన్యం చేయాలని సూచించారు. – కార్యక్రమంలో ఆమె వెంట ఎటపాక టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, క్లస్టర్ ఇంచార్జీ వల్లభనేని చందు, మండల ప్రధాన కార్యదర్శి కనితిమధు, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, ముచ్చా శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్ , ఎంపీటీసీ పాయం దేవి గొమ్ము కొత్తగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జి బాచినేని మల్లేశ్వరరావు , నలజాల మదు, పాటి సంపత్, నలజాల శ్రీకాంత్ , విజ్జగిరి రవితేజ , పాలడుగు నవీన్ , స్రవంతి , మాజీ ఎంపీపీ రమాదేవి, మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కాళేశ్వరం...ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం !

దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరిం చాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్ధరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷–రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి

ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది.ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చా అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమిషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

# బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

శంషాబాద్ బహదూర్ గూడలో ఉద్రిక్తత నెలకొంది. బుల్లెట్ ట్రైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. బహదూర్ గూడా భూముల దగ్గరకు హైడ్రా అధికారులు భారీగా చేరుకున్నారు. భూముల వ్యవహారంలో ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగుతోంది. స్పష్టమైన హామీ ఇచ్చాకే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో..

బహదూర్‌గూడ భూముల జోలికొస్తే ఖబర్దార్ అంటూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. హైడ్రా కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని అనుకున్నాం. కానీ మీరు బ్లాక్ మెయిలర్‌లు ప్రజలను భయపెట్టడానికి వచ్చిన హైడ్రా అంటూ విరుచుకుపడ్డారు. బహదూర్‌గూడా భూములపై స్టాటస్‌కో ఉంది కాబట్టి జిల్లా కలెక్టర్ కోర్టు అనుమతి లేకుండా భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రజాక్షేత్రంలో నిలబెడతామని అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో చేపట్టిన రైతు నిరసన ఐదో రోజుకు చేరింది. రైతులకు ఈరోజు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాజేందర్ నగర్ ఇంచార్జ్ పట్ల కార్తీక్ రెడ్డి నిలబడ్డారు. బహదూర్ గూడ లోని వ్యవసాయ పొలాలని తరతరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్న ప్రజలకు బులెట్ ట్రైన్ పేరుతో లాక్కోవాలని చూస్తుంది. కానీ ముమ్మాటికి రైతుల పక్షాన ఉండి పోరాడుతాం, ఎక్కడికైనా వెళతాం కానీ రైతుల భూములను లాక్కునే ప్రసక్తి లేదంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. భూముల రైతులను పిలిచి బెదిరించి భూములను తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. కానీ బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

రానున్న 2 సంవత్సరాల్లో కెసిఆర్ ప్రభుత్వం రాబోతుంది కాబట్టి బహదూర్ గూడా రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందొద్దని అందరికీ కెసిఆర్ చేతుల మీదుగా పట్టా, పాసు పుస్తకాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

## ఈనెల 24వ తేదీన మెగా పేరెంట్, టీచర్స్ మీట్

**ఈనెల 20వ తేదీన షైనింగ్ స్టార్స్ కార్యక్రమం**

**తల్లితండ్రులు ఇద్దరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి**

**పక్కాగా ఏర్పాట్లు చేయాలి - అధికారులతో జేసీ అభిషేక్ గౌడ టెలి కాన్ఫరెన్స్**



**ఏలూరు బ్యూరో చీఫ్, జూలై , 18 నంది పత్రిక** జిల్లాలో ఈనెల 24వ తేదీన జరగనున్న మెగా పేరెంట్, టీచర్స్ మీట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శనివారం మెగా పేరెంట్, టీచర్స్ మీట్, షైనింగ్ స్టార్స్ కార్యక్రమాల ఏర్పాట్లపై అధికారులతో అభిషేక్ గౌడ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 24వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 10వ తరగతి, ఇంటర్ పరీక్షలలో లలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈనెల 20వ తేదీ సోమవారం షైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమంలో సన్మానించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థుల తల్లితండ్రులు ఇద్దరూ పాల్గొనేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. మెగా పేరెంట్, టీచర్స్ మీట్ నాటికి విద్యార్థుల తల్లితండ్రులు అందరూ లీప్ యాప్ డౌన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలను రంగోలి ముగ్గులతో చక్కగా అలంకరించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి ఆహ్వానపత్రం ను తల్లితండ్రులందరికీ చేరేలా చూడాలని, అదేవిధంగా ప్రోటోకోల్ నిబంధనల ననుసరించి పాఠశాల పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ రాజకీయ సభలా కాకుండా ఒక ఆహ్లాదకరమైన కుటుంబ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం ఉదయం 9.30 ని.ల నుండి మధ్యాహ్నం 12. 45 ని.ల వరకు నిర్వహించాలన్నారు. ముందుగా తల్లితండ్రులను, ముఖ్యఅతిదులను కార్యక్రమానికి ఆహ్వానించాలని, ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధించి నివేదిక ను తెలియజేయాలన్నారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల విద్యా స్థాయికి సంబందించిన నివేదికను తల్లితండ్రులకు తెలియజేయాలన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధి గురించి తెలియజేసి, తల్లితండ్రుల సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. తల్లికి వందనం అర్హులైన ప్రతీ ఒక్కరికీ వచ్చిందా ? లేదా?అనే విషయాన్నీ తెలుసుకోవాలని, అర్హత ఉండి రాని వారి వివరాలు తెలుసుకుని, వారికి కూడా తల్లికి వందనం పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం సభ కార్యక్రమం నివహించాలని, చివరిగా రుచికరమైన మెనూ తో భోజనం అందించాలన్నారు. షైనింగ్ స్టార్స్ కార్యక్రమం ఈనెల 20వ తేదీ ఉదయం 9 గంటలకు వట్లూరు లోని సర్. సి. ఆర్. రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించడం జరుగుతుందన్నారు. డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఎంపిడిఓ లు, ఎంఈఓ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కూటమి దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది

కూటమి పాలనలో దోపిడీకి హద్దు లేకుండాపోతోందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లాల్లో పంచ భూతాలను ఎంపీ సీఎం రమేష్ దోచుకుంటున్నారని అమర్నాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మహా పాపానికి కూటమి నేతలు ఒడిగట్టారు అంటూ మండిపడ్డారు. అనకాపల్లి జిల్లాలోని ఎలమంచిలిలో పంచదారల కొండపై అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలకు దిగారు. వారి రిలే దీక్షలకు వైఎస్సార్‌సీపీ నేతలు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, దాడిశెట్టి రాజా, కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ క్రమంలో రిలే నిరాహార దీక్షను సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ..'ఎంపీ సీఎం రమేష్ దోపిడీ పీక్ స్టేజ్‌కు చేరుకుంది. కొండలను పిండి చేస్తున్నారు. వందల లారీలతో గ్రావెల్ తరలిస్తున్నారు. పవిత్రమైన పంచదార్ల కొండను మింగేస్తున్నారు. మహా పాపానికి కూటమి నేతలు ఒడిగట్టారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఏమైపోయారు?. 1200 ఏళ్ల చరిత్ర కలిగిన పంచదార కొండను ధ్వంసం చేస్తున్నారు. ఈ పాపానికి పవన్ కళ్యాణ్ ఏం ప్రాయశ్చిత్తం చేస్తారు?' అని ప్రశ్నించారు. కురసాల కన్నబాబు మాట్లాడుతూ..'దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు దోపిడీకి కూటమి నేతలు పాల్పడుతున్నారు. కొండలను మాయం చేస్తున్నారు. పర్యావరణానికి విఘాతం కల్పిస్తున్నారు. కడప నుంచి సీఎం రమేష్ ప్రజా సేవకు వచ్చారు అనుకున్నాం. వారి కంపెనీల పేరు మీద పర్మిట్లతో కొండలను మింగేస్తున్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే నాయకులు తెల్లవారితే ఉమా ధర్మ లింగేశ్వర స్వామి దేవాలయానికి గుండు కొడుతున్నారు. ఇక్కడ జరుగుతున్న అన్యాయాన్ని వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్తాం. ఈ నెల 21వ తేదీన చలో పంచదార్ల కార్యక్రమం నిర్వహిస్తాం. 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పంచదార్ల కొండలను నో మైనింగ్ జోన్ గా ప్రకటించాలి. మైనింగ్ లీజులు సోమవారం లోపు రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి దాడి శెట్టి రాజా మాట్లాడుతూ..'మహా పవిత్రమైనవి పంచదార్ల కొండలు. ఈ కొండ గురించి మహా భారతంలో ప్రస్తావన ఉంది. చోళుల కాలంలో ఉమా ధర్మ లింగేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించారు. పంచదార్ల కొండపై జరుగుతున్న అక్రమ మైనింగ్ సనాతన వాదులకు కనిపించలేదా?. సంపద సృష్టి పేరుతో వారసత్వ సంపదను దోచుకుంటున్నారు. ఎక్కడ నుంచో వచ్చి ఉత్తరాంధ్ర సంపాదనను దోచుకుంటున్నారు అని మండిపడ్డారు. కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ.. 'పంచదార్ల కొండపై కూటమి అనకొండలు పడ్డాయి. కొండలను ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ గద్దల్లా దోచుకుంటున్నారు. అక్రమ మైనింగ్ పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. 30 కిలో మీటర్ల పరిధిలో పంచదార్ల కొండలు విస్తరించి ఉన్నాయి. ప్రజలకు జీవనాధారం ఈ కొండలు' అని చెప్పుకొచ్చారు.

## తుంగభద్ర పరివాహక రాష్ట్రాలతో భేటీ

తుంగభద్ర పరీవాహక ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం కేంద్రం ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తొలిసారిగా ఈనెల 27న ఢిల్లీలో కేంద్ర జలసంఘం కార్యాలయంలో సమావేశం కానుంది. సీడబ్ల్యూసీ సభ్యుడుయోగేష్ పైథంకర్ అధ్యక్షతన ఏపీ ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శి బీఎస్ శివశంకర్, తెలంగాణ ఈఎన్‌సీ ఓవీ రమేష్ బాబు, సీడబ్ల్యూసీ సీఈలు అభిషేక్ బెనర్జీ, సంజయ్ గంగ్వార్, శరబ్‌జీత్‌సింగ్ భక్షీ, ఓంప్రకాష్ గుప్తా సభ్యులుగా ఉన్న ఈ కమిటీకి తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఆస్మా ఖాతూన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. గత నెల 25న తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్లు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తోపాటు ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ హాజరై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాల వినియోగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఆ మేరకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈనెల 11న కేంద్ర జల్ శక్తి శాఖ జాయింట్ కమిషనర్ సంజయ్‌కుమార్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు అంశాలపై అధ్యయనం చేసి ఆర్నెల్లలోగా నివేదిక ఇవ్వాలని ఆ కమిటీని నిర్దేశిరచారు. తుంగభద్ర హైపవర్ కమిటీ అధ్యయనం చేసే అంశాలివీ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) కింద చారిత్రక వినివియోగం, నీటి అవసరాలు, నిర్వహణలో ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం చేస్తారు. తుంగభద్ర డ్యాంలో ఏ మేరకు పూడిక చేరింది..? దాని వల్ల నీటి నిల్వ సామర్థ్యం ఎంత తవిగ్గింది..? సాగు, తాగునీటి అవసరాలు, జలవిద్యుదుత్పత్తిపై ఏ మేరకు ప్రభావం పడుతోంది..? డ్యామ్ భద్రత, వరద నియంత్రణ చర్యలపై సూచనలు చేస్తారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక తీతకు సంబంధించి సాంకేతిక, ఆర్థిక అంశాలను పరిశీలించి లాభదాయక మార్గాలను సూచించడం. ఇకపై రిజర్వాయర్‌లో పూడిక చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు. ?ఆర్డీఎస్‌కు నీటి లభ్యవిత భరోసా కల్పింవిచేందుకు తుంగభద్ర డ్యావిమ్ దిగువన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాల్సిన అవసరంతోపాటు ట్రిబ్యునల్ అవార్డులు, ఒప్పంవిదాలు, న్యాయపరమైన ఆమోదంపై అధ్యయనం వంటివి పరిశీలిస్తారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీత వల్ల ప్రయోజనం ఉంటుందా? సమాంతరంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించడం వల్ల మేలు జరుగుతుందా? లాంటి అంశాలపై సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల పరిశీలన. అంతరాష్ట్ర అంశాలు, సామాజిక, పర్యావరణ, న్యాయపరమైన చిక్కులపై అధ్యయనం. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పులకు లోబడి రాష్ట్రాలకు వాటా మేరకు నీరు అందే అవకాశంపై పరిశీలన. అవసరమైతే సబ్ కమిటీలు ఏర్పాటు చేసి ప్రత్యేక ఆహ్వానితులను నియమించుకునేందుకు హైపర్ కమిటీకి అధికారాలు అప్పగించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com